
బండిఆత్మకూరు: లింగాపురం వద్ద నీట మునిగిన వరి పొలాలు

మొంథా పంజా..


కోసిగి మండలం ఆర్డీఎస్ ఆనకట్టపై ఉధృతంగా ప్రవహిస్తున్న వరద


నంద్యాల: వర్షపు నీటిలో మంత్రి ఎన్ఎండీ ఫరూక్, కలెక్టర్ రాజకుమారి


సిద్దాపురం చెరువును సందర్శించిన ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి

కర్నూలు అగ్రికల్చర్/ నంద్యాల టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కర్నూలు, నంద్యాల జిల్లాలో వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకుతోడు మొంథా తుఫాన్ బీభత్సం సృష్టించింది. చేతికొచ్చిన పంటలు నీటమునగడంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. కల్లాల్లో ఆరబెట్టిన మొక్కజొన్న మొలకలెత్తడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. చేతికొచ్చిన వరిపంటను వర్షపు నీరు ముంచెత్తడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కర్నూలు జిల్లాలోని ఆరు మండలాల్లో 2,219 మంది రైతులకు తీరని నష్టం జరిగింది. వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి పంట నష్టం వివరాలను వెల్లడించారు. హొళగుంద మండలంలోని 180 మంది రైతులకు సంబంధించిన 150 ఎకరాల్లోని వరి వర్ష ప్రభావం వల్ల దెబ్బతిందని వివరించారు. కోసిగి మండలంలోని మూడు గ్రామాల్లో 154 మంది రైతులకు సంబంధించిన 125 హెక్టార్లలో సాగు చేసిన వరి పంట దెబ్బతిందని, అదే విధంగా మంత్రాలయంలో 8 గ్రామాల్లో 280 మంది రైతులు సాగు చేసిన 85 హెక్టార్లలో వరి పంట దెబ్బతిన్నదని తెలిపారు. ఆలూరులో నాలుగు గ్రామాల్లోని 75 మంది రైతులు సాగు చేసిన 92 హెక్టార్లలోని పప్పుశనగ దెబ్బతిందని, చిప్పగిరి మండలంలోని రెండు గ్రామాల్లో 22 మంది రైతులు సాగు చేసిన 17 హెక్టార్లలో పప్పుశనగ వర్షం నీటిలో మునిగిందన్నారు. మద్దికెర మండలంలోని ఆరు గ్రామాల్లో 1500 మంది రైతుల హెక్టార్లలో పప్పు శనగ దెబ్బతిందని తెలిపారు. మొత్తం ఆరు మండలాల్లోని 27 గ్రామాల్లో 2,209 రైతులకు సంబంధించి వరి 360 హెక్టార్లలో, పప్పు శనగ 1,109 హెక్టార్లలో దెబ్బతిన్నట్లు ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు జేడీ తెలిపారు.

మరిన్ని వార్తలు 6లో...

- కర్నూలు జిల్లాలో ఆరు మండలాల్లో ప్రభావం
- నంద్యాల జిల్లాలో 36,948.21 హెక్టార్లలో పంట నష్టం
- అత్యధికంగా శ్రీశైలంలో 269.8 మి.మీ., వర్షపాతం నమోదు
- కోసిగిలో పొంగి ప్రవహించిన ఆర్డీఎస్
- పలు గ్రామాలకు స్తంభించిన రాకపోకలు

ఆర్డీఎస్‌కు పోటెత్తిన వరద

కోసిగి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ధాటికి ఆర్డీఎస్ ఆనకట్టకు వరద నీరు భారీగా పోటెత్తింది. మండల పరిధిలోని అగసనూరు గ్రామ సమీపంలోని తుంగభద్రనదిపై ఉన్న ఆర్డీఎస్ ఆనకట్టకు మొంథా తుఫాన్ ఎఫెక్ట్‌తో భారీగా వరద నీరు తుంగభద్ర నదికి చేరింది. దీంతో ఆర్డీఎస్ ఆనకట్ట మీద సుమారు నాలుగు అడుగుల మేర వరద దిగువకు ప్రవహిస్తోంది. తుంగభద్ర నదితీర గ్రామాల ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ వేణుగోపాల్, సీఐ మంజునాథ్, ఎస్ఐ హనుమంతరెడ్డి, ఎంపీడీవో ఈశ్వరయ్య స్వామిలు గ్రామాల్లో దండోరా వేయించి ప్రజలను, రైతులను అప్రమత్తం చేస్తున్నారు. మరో మూడు రోజులు పాటు తుంగభద్ర నది తీర ప్రాంతాల రైతులు అప్రమత్తంగా ఉండాలని తుంగభద్ర నదిలోకి మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని హెచ్చరించారు. సాతనూరు, తుమ్మిగనూరు, కడిదొడ్డి, కందుకూరు, అగసనూరు గ్రామాల్లో చేతికొచ్చిన వరిపైర్లు నేలకొరగడంతో వ్యవసాయాధికారి ఎం.వరప్రసాద్ ఆధ్వర్యంలో కర్నూలు ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్తలు డా.సుజాత, డా.వైఎస్ సతీష్ కుమార్, ఆదోని సహాయ వ్యవసాయసంచాలకులు బాలమర్దిరాజు పర్యటించారు.



చింతలపల్లిలో కూలిన మట్టిమిద్దె

ఓర్వకల్లు మండలం చింతలపల్లె గ్రామంలో గొల్ల లచ్చమ్మకు చెందిన మట్టిమిద్దె వర్షానికి బుధవారం కూలిపోయింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. అయితే ఇంట్లోని వస్తువులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. - ఓర్వకల్లు (ఆంధ్రజ్యోతి)


కోసిగిలో దెబ్బతిన్న వరి పంట


చాగలమర్రిలో నీట మునిగిన మల్లె తోటను చూపిస్తున్న రైతులు


గోనెగండ్లలో పత్తిపంటలోకి చేరిన వర్షపు నీరు


మిడుతూరులో కుందూ ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

ఏ,బీ,సీ క్యాంపుల్లో హైకోర్టు బెంచ్

- స్మార్ట్ సిటీ పనులు వేగవంతం
- మెడికల్ కాలేజీ రోడ్డులోని షాపులపై కోర్టు తీర్పు అమలు
- నగరపాలక సంస్థ అధికారులతో మంత్రి టీజీ భరత్

కర్నూలు అర్బన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఏ, బీ, సీ క్యాంపుల్లో హైకోర్టు బెంచ్ ఏర్పాటుపై సీఎం చంద్రబాబుతో చర్చించానని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. బుధవారం ఎస్‌బీఐ కాలనీలోని నగరపాలక సంస్థ కార్యాలయంలో అధికారుల సమీక్ష అనంతరం మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం కర్నూలుపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ, ప్రగతిలో ముఖ్యస్థానాన్ని ఇవ్వాలనే లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. కర్నూల్లో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు ప్రభుత్వం సుముఖంగా ఉందని, ఈ భవనాలను నగర శివార్లలో కాకుండా ఏ, బీ, సీ క్యాంపుల్లో ఏర్పాటు చేసే అంశంపై ఇటీవల విదేశీ పర్యటనలో సీఎం చంద్రబాబుతో చర్చించానని వెల్లడించారు. సీఎం చంద్రబాబు దీనికి సానుకూలంగా స్పందించారని తెలిపారు. వాటిలోనే స్మార్ట్ సిటీ ప్రాజెక్టు పనుల కోసం అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. నగరంలోని బుధవారపేట మెడికల్ కాలేజీ మలుపు వద్ద ఉన్న షాపుల తొలగింపుపై న్యాయస్థానం ఇచ్చిన తీర్పును అమలు చేసేందుకు చర్యలు ప్రారంభించినట్లు తెలిపారు. తరువాత రహదారులు విస్తరణ, పారిశుధ్యం, టిడ్కో గృహాలు, గత సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాల అమలు పురోగతి తదితర అంశాలపై నగర పాలక సంస్థ అధికారులతో సమీక్షించారు. నగరంలో రూ. 12.62 కోట్లతో జరుగుతున్న 62 అభివృద్ధి పనులపై కాంట్రాక్టర్ల వారిగా సమీక్ష నిర్వహించారు. జాప్యం జరుగుతున్న పనులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆలస్యం చేసే కాంట్రాక్టర్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమీక్షలో కమిషనర్ పి. విశ్వనాథ్, అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్‌కుమార్, మేనేజర్ చిన్న రాముడు, ఇన్‌చార్జీ ఎస్ఈ శేషసాయి, జునైదు, స్వర్ణలత, నాగరాజు, మనోహర్‌రెడ్డి, అంజాద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

నిండుకుండలా జీడీపీ

హంద్రీకి నీటి విడుదల నిలిపివేత


గాజులదిన్నె ప్రాజెక్టును పరిశీలిస్తున్న కలెక్టర్ సిరి

గోనెగండ్ల, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): గాజులదిన్నె ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల నుంచి 50 క్యూసెక్కుల నీరు చేరుతున్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. ప్రస్తుతం గాజులదిన్నె ప్రాజెక్టులో నీటి మట్టం పూర్తిస్థాయిలో ఉంది. బుధవారం సాయంత్రం 376.52 మీటర్ల నీటి మట్టంతో జీడీపీ నిండుకుండలా మారింది. జీడీపీ పూర్తిస్థాయి నీటి మట్టం 377మీటర్లు. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే నీటిని ఎప్పటికప్పుడు దిగువకు విడుదల చేస్తామని అధికారులు తెలిపారు. ఎగువ ప్రాంతాల్లో వర్షం కురియకపోడంతో ప్రాజెక్టుకు నీరు చేరలేదు. దీంతో బుధవారం ఉదయం ఇరిగేషన్ అధికారులు నీటి విడుదల నిలిపివేశారు. రబీ సీజన్‌లో నీటికి ఇబ్బంది ఉండదని ఆయకట్టు రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు.

జీడీపీని సందర్శించిన కలెక్టర్

గోనెగండ్ల మండలంలో పర్యటించిన కలెక్టర్ ఏ.సిరి గాజులదిన్నె ప్రాజెక్టును సందర్శించారు. ప్రాజెక్టులో ఉన్న నీటివివరాలు ఇరిగేషన్ ఎస్ఈ బాలచంద్రారెడ్డిని అడిగి తెలుసుకున్నారు.

వర్షం దెబ్బకు మార్కెట్ ఖాళీ


పంట ఉత్పత్తులు లేక నిర్మానుష్యంగా మారిన కర్నూలు మార్కెట్ యార్డు

కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో చేతికందిన పంట ఉత్పత్తులను రైతులు అమ్ముకోలేని పరిస్థితి నెలకొంది. అమ్మకానికి వచ్చిన పంట ఉత్పత్తులతో రోజు కర్నూలు మార్కెట్ యార్డులో వందలాది మంది రైతులు వేల క్వింటాళ్ల పంట ఉత్పత్తులతో కర్నూలు మార్కెట్ యార్డు కళకళలాడేది. అయితే బుధవారం పంట ఉత్పత్తులు లేక యార్డు బోసిపోయింది. కర్నూలు మార్కెట్ యార్డులో దాదాపు 26 రకాల పంట ఉత్పత్తులు వేరుశనగ, పూలవిత్తనాలు, మొక్కజొన్న, కందులు, ఉల్లిగడ్డలు, శనగలు, మిర్చి వరి, మినుములు, సోయాబీన్స్, సజ్జలు, పూల విత్తనాలు తదితర పంట ఉత్పత్తులు ప్రతి రోజూ అమ్మకానికి జిల్లా నలుమూలల నుంచి, తెలంగాణ, కర్ణాటక ప్రాంతాల నుంచి రైతులు అమ్మకానికి తెస్తున్నారు. బుధవారం వేరుశనగ కాయలు కేవలం 39 క్వింటాళ్లను మాత్రమే రైతులు అమ్మకానికి తెచ్చారు. గరిష్ఠ ధర బాగా తగ్గింది. క్వింటం వేరుశనగ కాయల గరిష్ఠ ధర రూ.5,208, మధ్యస్థ, కనిష్ఠ ధరలు 3,799 మాత్రమే రైతుకు అందాయి. ఆముదాలు 418 క్వింటాళ్లు అమ్మకానికి వచ్చాయి. గరిష్ఠ ధర రూ.5,802, మధ్యస్థ ధర రూ.5,779, కనిష్ఠ ధర రూ.5,489 అందాయి. ఉల్లిగడ్డలు కేవలం 420 క్వింటాళ్లు మాత్రమే అమ్మకానికి రాగా, గరిష్ఠంగా క్వింటానికి రూ.1,279, మధ్యస్థ ధర రూ.911, కనిష్ఠ ధర రూ.429 మాత్రమే రైతులకు దక్కింది. సజ్జలు 31 క్వింటాళ్లు రాగా, గరిష్ఠ ధర రూ.2111, మధ్యస్థ ధర రూ.1,851, కనిష్ఠ ధర రూ.1,701 అందింది

మొంథా పంజా

పొంగి పొర్లిన వాగులు, వంకలు



బండిఆత్మకూరు అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ బండిఆత్మకూరు మండలంలపై పంజా విసిరింది. ఏకంగా గత రాత్రి 110 మిమీ ఎక్కువగానే వాన కురిసింది. దీంతో మండలంలోని కుందూనది, మద్దిలేరు, సంకలాగు, ఉప్పాగు, పోతులవాగు, రాళ్ళవాగులతో పాటు పలు వంకలు, కాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. భోజనం, కాకనూరు, పరటూరు గ్రామాల వద్ద ఉన్న కుందూనది వంతెనలపై నీటి ప్రవాహం నాలుగు అడుగుల మేర ప్రవహిస్తోంది. దీంతో పలు గ్రామాల మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయి, జనజీవనం స్తంభించింది.



మద్దిలేరు వాగు కింద నీట మునిగిన పంట పొలాలు

జల దిగ్బంధంలో నేలంపాడు

చాగలమర్రి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో చాగలమర్రి మండలంలోని నేలంపాడు గ్రామాన్ని వరద చుట్టుముట్టింది. కలుగొట్లపల్లె, బ్రాహ్మణపల్లె, కూలూరు రహదారిలోని వక్కిలేరు ఉధృతంగా ప్రవహించడంతో ఆయా గ్రామాల రాకపోకలు స్తంభించాయి. 19 గ్రామ పంచాయతీల్లో రైతులు సాగు చేసిన మొక్కజొన్న, పత్తి, మినుము, వరి, బెండ, కంది, మల్లెపూల తోటలు నీట మునిగాయి.

నంద్యాల టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో మొంథా తుఫాన్ ధాటికి 36,948.21 హెక్టార్‌లలో పంట నష్టం వాటిల్లినట్లు అధికారులు ప్రాథమిక అంచనాలు రూపొందించారు. నంద్యాల మండలంలో 19 గ్రామాలను వరద ముంచెత్తింది. దీంతో 2792 మంది రైతులకు 1960 హెక్టార్ల వరి, నాలుగు హెక్టార్ల కంది, 23 హెక్టార్‌ల మినుము, 495 హెక్టార్‌ల మొక్కజొన్న, 100 హెక్టార్ల పొగాకు, 18 హెక్టార్‌ల సోయాబీన్ మొత్తంగా 2602.8 హెక్టార్‌లలో పంటలకు నష్టం వాటిల్లింది. బండిఆత్మకూరు మండలంలో 15 గ్రామాల్లో 3871 మంది రైతులకు చెందిన 3065 హెక్టార్ల వరి, 73 హెక్టార్లలో మినుము, 117 హెక్టార్లలో మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. గడివేముల మండలంలో 11 గ్రామాల్లో 1561 మంది రైతులకు చెందిన 564 హెక్టార్ల వరి, 36 హెక్టార్ల కంది, 70 హెక్టార్ల మినుము, 50 హెక్టార్ల పత్తి, 224 హెక్టార్లలో మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. పాణ్యం మండలంలో 12 గ్రామాల్లో 1834 మంది రైతులకు చెందిన 1067 హెక్టార్లలో వరి, 26 హెక్టార్లలో కంది, 24 హెక్టార్లలో మినుము, 33 హెక్టార్లలో పత్తి, 140 హెక్టార్లలో మొక్కజొన్న, 173 హెక్టార్లలో పొగాకు పంటలు దెబ్బతిన్నాయి. మహానంది మండలంలో 8 గ్రామాల్లో 1148 రైతులకు చెందిన 1520 హెక్టార్లలో వరి, 38 హెక్టార్‌లలో మొక్కజొన్న పంటలు నీట మునిగాయి. బనగానపల్లె మండలంలో 10 గ్రామాల్లో 3520 రైతులకు చెందిన 800 హెక్టార్లలో కంది. 100 హెక్టార్లలలో మినుము, 1600 హెక్టార్లలో మొక్కజొన్న, 50 హెక్టార్లలో పత్తి పంటలు దెబ్బతిన్నాయి. నందికొట్కూరు మండలంలో ఆరు గ్రామాల్లో 672 మంది రైతులకు చెందిన 16 హెక్టార్లలో పత్తి, 661 హెకార్లలో మొక్కజొన్న, 17 హెక్టార్‌లలో పొగాకు, 40 హెక్టార్‌లలో సోయాబీన్ పంటలు దెబ్బతిన్నాయి. జూపాడుబంగ్లా మండలంలో 10 గ్రామాల్లో 979 మంది రైతులకు చెందిన 257 హెక్టార్‌ల వరి, 15 హెక్టార్‌ల కంది, 142 హెక్టార్‌ల పత్తి, 854 హెక్టార్‌ల మొక్కజొన్న పంటలకు నష్టం వాటిల్లింది. ఆళ్లగడ్డ మండలంలో 20 గ్రామాల్లో 3053 రైతులకు చెందిన 1219 హెక్టార్‌లలో వరి, 108 హెక్టార్‌లలో కంది, 87 హెక్టార్‌లలో పత్తి, 2015 హెక్టార్‌లలో మొక్కజొన్నకు నష్టం వాటిల్లింది. శిరివెళ్ల మండలంలో 12 గ్రామాల్లో 1100 మంది రైతులకు చెందిన 1080 హెక్టార్‌ల వరి, 120 హెక్టార్‌ల మొక్కజొన్న పంటలు నీటమునిగాయి. గోస్పాడు మండలంలో 15 గ్రామాల్లో 1470 మంది రైతులకు చెందిన 1250 హెక్టార్‌లలో వరిపంట నీటమునిగింది. ఆత్మకూరు మండలంలో 12 గ్రామాల్లో 7150 మంది రైతులకు చెందిన 1047 హెక్టార్‌ల వరి, 2753 హెక్టార్‌లలో మొక్కజొన్న, 24 హెక్టార్‌లలో సోయాబీన్ పంటలు దెబ్బతిన్నాయి. వెలుగోడు మండలంలో రెండు గ్రామాల్లో 232 మంది రైతులకు చెందిన 282 హెక్టార్‌లలో వరి పంట దెబ్బతింది. ఉయ్యాలవాడ మండలంలో 14 గ్రామాల్లో 368 మంది రైతులకు చెందిన 143 హెక్టార్‌లలో వరి, 37 హెక్టార్‌లలో కంది, 44 హెక్టార్‌లలో మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి.

● 744 హెక్టార్లలలో ఉద్యాన పంటలకు నష్టం

జిల్లాలోని మొంథా తుఫాన్ ధాటికి 744 హెక్టార్‌లలో ఉద్యానపంటలు దెబ్బతిన్నాయి. 803 మంది రైతులకు చెందిన ఉల్లిపంట 443.23 హెక్టార్‌లలో నష్టం వాటిల్లింది. 101 మంది రైతులకు చెందిన 66 హెక్టార్‌లలో బొప్పాయి పంట దెబ్బతింది. 17 మంది రైతులకు చెందిన 10హెక్టార్‌లో టమోటా పంటకు నష్టం వాటిల్లింది. 63 మంది రైతులకు చెందిన 33.7 హెక్టార్‌లలో చామంతి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. 277 మంది రైతులకు చెందిన 186 హెక్టార్‌లలో పచ్చి మిర్చి పంట నీటమునిగి నష్టం వాటిల్లింది.

● జిల్లాలో అత్యధికంగా

2694.6 ఎంఎం వర్షపాతం నమోదు

జిల్లాలో ఒక్కరోజుల్లోనే గతంలో ఎన్నడూ లేనివిధంగా అత్యధికంగా 2694.6 ఎంఎం వర్షపాతం నమోదైంది. శ్రీశైలం 269.8, వెలుగోడు 172.0, ఆత్మకూరు 139.6, మహానంది 133.4, జూపాడుబంగ్లా 124.8, నంద్యాల 122.4, బండిఆత్మకూరు 113.6, రుద్రవరం 106.8, నందికొట్కూరు 103.0, ఆళ్లగడ్డ 98.6, శిరివెల్ల 98.6, పాములపాడు 90.2, పడిగ్యాల 87.6, గోస్పాడు 85.2, ఉయ్యాలవాడ 84.6, గడివేముల 80.8, దొర్నిపాడు 76.4, కోవెలకుంట్ల 75.6, పాణ్యం 72.2, చాగలమర్రి 70.0, మిడ్తూరు 65.2, కొత్తపల్లె 62.0, బనగానపల్లె 54.2, బేతంచర్ల 53.2, సంజామల 49.6, అవుకు 46.2, డోన్ 33.2, కొలిమిగుండ్ల 23.0, ప్యాపిలి 7.4ఎంఎం వర్షపాతం నమోదైంది.



ఆత్మకూరులోని ఇందిరానగర్‌లో నిలిచిన వర్షపు నీరు



దెబ్బతిన్న వరిపంట



రుద్రవరం మండలం చిలకలూరు గ్రామ సమీపంలో పొంగిన వక్కిలేరు వాగు

పరిశీలించిన మంత్రి, కలెక్టర్



ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తున్న మంత్రి, కలెక్టర్

నంద్యాల రూరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్ ప్రభావంతో భారీగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నంద్యాల పట్టణం లోతట్టు ప్రాంతాలను రాష్ట్ర న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, కలెక్టర్ రాజకుమారి బుధవారం ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కుందూ పరివాహక ప్రాంతాలైన నందమూరినగర్, వైఎస్‌ఆర్‌నగర్, ఎస్బీవై కాలనీ, శ్యాంనగర్, పెద్దకొట్టాల వంటి ప్రాంతాల్లో పర్యటించినట్లు తెలిపారు. ప్రజలకు అన్ని రకాలుగా సహాయం అందించాలని అధికారులను ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లోని చర్యలను ఎప్పటికప్పుడు కంట్రోల్ రూంలో పర్యవేక్షిస్తున్నామన్నారు. పంటలు నష్టపోయిన వారికి త్వరలోనే ప్రభుత్వం నుంచి సాయం అందిస్తామన్నారు.



భవనాశి వాగును పరిశీలిస్తున్న ఎస్పీ సునీల్‌షెరాన్

విధుల్లో అప్రమత్తంగా ఉండాలి: ఎస్పీ

ఆత్మకూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో పోలీసు సిబ్బంది విధుల్లో అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సునీల్‌షెరాన్ అన్నారు. బుధవారం ఆయన ఆత్మకూరు ప్రాంతంలోని భవనాశి, పీతురువాగు, సిద్ధాపురం చెరువు సమీపంలో ఉప్పొంగి ప్రవహిస్తున్న అలుగు జలాలను పరిశీలించారు. అక్కడి పరిస్థితుల గురించి సీఐ రామును అడిగి తెలుసుకున్నారు. కురుకుంద, కొట్టాలచెరువు గ్రామాలకు, కొత్తపల్లి మండలంలోని గ్రామాలకు, వడ్లరామాపురానికి రాకపోకలు నిలిచాయని ఆయన వివరించారు. సిద్ధాపురం అలుగు ఉప్పొంగడంతో ఆత్మకూరు - దోర్నాలకు రాకపోకలు స్తంభించాయని తెలిపారు. రాకపోకలు లేని గ్రామాల్లో ప్రజలకు అత్యవసర సేవలు అందించాలని అధికారులకు సూచించారు. అనంతరం ఆత్మకూరు పోలీసు స్టేషన్‌ను సందర్శించారు. ఈయన వెంట ఆత్మకూరు ఆర్డీవో నాగజ్యోతి, డీఎస్పీ రామాంజీనాయక్, ఎస్సై నారాయణరెడ్డి ఉన్నారు.

60 మేకలు, గొర్రెపిల్లలు మృతి

బనగానపల్లె, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ మొంథా తుఫాన్‌కు మండలంలోని నందవరం గ్రామంలో 60 మేకలు, గొర్రెపిల్లలు మృతి చెందాయి. బుధవారం తెల్లవారుజామున నందవరం గ్రామానికి చెందిన గొర్రెల బర్రెన్న, హరికృష్ణ, కృష్ణమద్దిలేటికి చెందిన 60 గొర్రెలు, మేక పిల్లలు మృతి చెందినట్లు బాధితులు తెలిపారు. తుఫాన్ ప్రభావంతో గత మూడు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు గొర్రెలు, మేకలు మృతి చెందినట్లు తెలిపారు. మృతి చెందిన గొర్రెలు, మేక పిల్లల విలువ రూ.3 లక్షల నష్టం ఉంటుందన్నారు. తాము గొర్రెలను కాస్తూ జీవనం సాగిస్తున్నామని తుఫాన్ దెబ్బకు ఆర్థికంగా చితికిపోయామన్నారు. ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలన్నారు.



మృతి చెందిన గొర్రెపిల్లలు

జల దిగ్బంధంలో జనజీవనం

నంద్యాల హాస్పిటల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ తాకిడితో ప్రజల జనజీవనం అస్తవ్యస్థం మారింది. నంద్యాల పట్టణంలోని విశ్వనగర్, ఎన్.జీవో కాలనీ ప్రధాన రహదారి, హౌసింగ్‌బోర్డు వద్ద ఉన్న రామకృష్ణ పీజీ కళాశాల వద్ద ఉన్న చామకాల్వ బ్రిడ్జి, విశ్వనగర్‌లోని చామకాల్వబ్రిడ్జి వరద తాకిడితో ఎన్‌జీవోకాలనీ, లలితానగర్, విశ్వనగర్ ప్రాంతాల ప్రజలు జలదిగ్బంధంలో ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. బుధవారం చామకాల్వ వరద ఉధృతికి విశ్వనగర్‌లోని ఓ పాఠశాల నీట మునిగింది. విశ్వనగర్‌కు చెందిన వెంకటరాముడుకు చెందిన పసువుల పాక నీటమునగడంతో దాదాపు రూ.60వేల పసువుల మేత నీటమునిగింది. పసువుల పాకలోకి నీరుచేరడంతో పక్కనే ఉన్న నూతనంగా నిర్మిస్తున్న భవనంలోకి పసువులను చేర్చారు. ఎన్‌జీవో కాలనీ నుంచి పట్టణంలోకి వెళ్లేందుకు మూడు రహదార్లు మూసుకుపోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలకు గురయ్యారు.



హౌసింగ్‌బోర్డులో వరదనీరు

విరిగిపడిన కొండ చరియలు

శ్రీశైలం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా శ్రీశైలం నుంచి హైదరాబాద్ వెళ్లే రహదారిపై లింగాలగట్టు వద్ద తెల్లవారుజామున కొండచరియలు విరిగి రోడ్డుకు అడ్డంగా పడ్డాయి. ఆ సమయంలో వాహన రాకపోకలు లేకపోవడం వల్ల ఎలాంటి ప్రమాదం సంభవించలేదు. ఉదయం శ్రీశైలం నుంచి తెలంగాణ వైపునకు వెళ్లిన వాహనాలు పూర్తిగా నిలిచిపోవడంతో పోలీసులు ట్రాఫిక్ సమస్యను పరిష్కరించి రోడ్డుపై అడ్డంగా పడిన కొండ చరియలను ఎక్స్‌కవేటర్ సహాయంతో తొలగించారు. అనంతరం శ్రీశైలంలో నిలిచిపోయిన వాహనాలు వచ్చేందుకు అనుమతిచ్చారు. ఫారెస్ట్ చెక్‌పోస్టు వద్ద కొండల నుంచి బురద నీటి కారనంగా రాళ్లు జారి పడ్డాయి. దీంతో రోడ్డుకు ఆనుకుని ఉన్న ఇళ్లు, మూడు షాపులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. వెంటనే సున్నిపెంట సీఐ చంద్రబాబు ఆధ్వర్యంలో పోలీసులు పరిశీలించి రాళ్లను తొలగించేలా చర్యలు తీసుకున్నారు. అదే విధంగా సున్నిపెంట పూర్ణానంద ఆశ్రమం ప్రాంతంలో అనేక కాలనీల్లో భారీగా వర్షం నీరు ప్రవహించింది. ఆరో వార్డులోని ఒక రేషన్ షాపులో సుమారు 72 క్వింటాళ్ల బియ్యం తడిసిపోయింది. శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి ఆదేశాల మేరకు శ్రీశైలం మండల ఇన్‌చార్జ్ యుగేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రమణ, సురేష్ తదితరులు ముంపు ప్రాంతాల్లో పర్యటించి బాధితులకు తగు సహాయక చర్యలు చేశారు.

శ్రీశైలానికి నిలిచిన రాకపోకలు

శ్రీశైలంలో కురిసిన భారీ వర్షం కారణంగా బుధవారం తెల్లవారుజాము నుంచి గమ్యస్థానాలకు తిరుగు ప్రయాణమయ్యే వాహనాలను పూర్తిగా నిలిపివేశారు. శ్రీశైలం నుంచి తెలంగాణ, ఆంధ్ర, రాయలసీమ వైపునకు వెళ్లేందుకు రోడ్ క్లియరెన్స్ లేకపోవడంతో ఫారెస్ట్ అధికారులు రాకపోకలను నిలిపివేశారు. వసతి గదులు ఖాళీ చేసి వెళ్లేందుకు సిద్ధమైన యాత్రికులు టోల్‌గేట్ వద్ద బారులుదీరారు. అదే విధంగా ఆర్టీసీ బస్టాండ్‌లో ఒక్క బస్సు కూడా కదలకపోవడంతో వందలాది మంది యాత్రికులు అవస్థలుపడ్డారు. దేవస్థానం ఈవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రత్యేక వాహనాల్లో అల్పాహారాలు, మంచినీరు, పాలు, బిస్కెట్లను బస్టాండ్, ఔటర్ రింగ్‌రోడ్డు, శిఖరం ఫారెస్ట్ చెక్‌పోస్టు వద్ద యాత్రికులకు అందించారు. దాదాపు ఆరుగంటల తర్వాత తెలంగాణవైపునకు వాహనాలు అనుమతించగా సాయంకాలానికి దోర్నాలవైపు నుంచి కర్నూలు, విజయవాడ వెళ్లే వాహనాలను అధికారులు అనుమతించారు.



కొండ చరియలు తొలగిస్తున్న సున్నిపెంట సీఐ చంద్రబాబు

రైతులందరినీ ఆదుకుంటాం: కలెక్టర్



కోట కందుకూరులో నీట మునిగిన మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న కలెక్టర్

ఆళ్లగడ్డ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ తాలుకాలో తుఫాను కారణంగా నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటామని నంద్యాల కలెక్టర్ రాజకుమారి గనియా హామీ ఇచ్చారు. బుధవారం మండలంలోని కోట కందుకూరు, ఆలమూరు గ్రామాలలో అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా దెబ్బతిన్న మొక్కజొన్న, ఉల్లి తదితర పంటను ఆమె పరిశీలించారు. ఆయా గ్రామాలలో మొక్క జొన్న రైతులు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతం కలెక్టర్ విలేఖరులతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా భారీ వర్షపాతం నమోదయినట్లు తెలిపారు. నంద్యాల జిల్లాలోని శ్రీశైలంలో అత్యధికంగా 26 సెంటీమీటర్ల వర్షపాతం నమోదుకాగా, ఆళ్లగడ్డ, నంద్యాల ప్రాంతాల్లో 10 సెంటీమీటర్లకు పైగా వర్షపాతం నమోదైనట్లు తెలిపారు. నల్లమల్ల అడవులలో భారీ వర్షం కురవడంతో అక్కడి నుండి కాలువల ద్వారా నీరు దిగువకు చేరడంతో వాగులు వంకలు పొంగి ప్రవహిస్తున్నాయని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా నంద్యాల జిల్లా గురించి అడిగి తెలుసుకున్నారని కలెక్టర్ వివరించారు. ఆళ్లగడ్డ ప్రాంతంలో రైతులు ఎక్కువగా వరి పంట భారీగా వేశారని కోతకు వచ్చే దశలో వర్షాలకు దెబ్బతిందన్నారు. జిల్లా 5 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లను రైతులు పండించారని తెలిపారు. నష్టపోయిన రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన పని లేదని ప్రభుత్వం ప్రతి రైతును ఆదుకుంటుందని కలెక్టర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహశీల్దార్ జ్యోతి రత్నకుమారి, ఎంపీడీవో నూర్జహాన్, వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఉధృతంగా భవనాశి

ఆత్మకూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ వల్ల ఆత్మకూరు సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు విస్తారంగా వర్షాలు కురియడంతో భవనాశి ఉగ్రరూపం దాల్చింది. మిగతా వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహించాయి. పలు ప్రధాన రహదారులపై రాకపోకలు స్తంభించాయి. కొన్ని నెలలుగా కురుస్తున్న అధిక వర్షాలతో ఉమ్మడి కర్నూలు జిల్లాలోనే అతిపెద్ద చెరువుగా పేరుగాంచిన సిద్ధాపురం చెరువులోకి గరిష్ట స్థాయిలో నీటినిల్వలు చేరాయి. ఈ క్రమంలోనే మొంథా తుఫాన్ వల్ల కురిసిన భారీ వర్షం నీరంతా సిద్ధాపురం చెరువులోకి చేరింది. దీంతో చెరువులో నిల్వలు అధికమై డెలివరీ పాయింట్ సమీపంలోని అటవీ ప్రాంతంలో గల ఓ అలుగు ద్వారా గాలేరులోకి నీరు ప్రవహిస్తోంది. అదేక్రమంలో కర్నూలు - గుంటూరు జాతీయ రహదారి పక్కనే ఉన్న మరో అలుగు ద్వారా వరద జలాలు కేజీ రోడ్డు మీదుగా అటవీ ప్రాంతంలోకి ప్రవహించాయి. అలాగే రాళ్లవాగు జలాలు కూడా కేజీరోడ్డుపైకి రావడంతో నాలుగైదు అడుగుల మేర నీటి ఉధృతి ఉండటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో ఆత్మకూరు నుంచి దోర్నాల వైపు వెళ్లే వాహనాలను పోలీసులు నంద్యాల, గిద్దలూరు మీదుగా మళ్లించారు. అదే క్రమంలో దోర్నాల నుంచి ఆత్మకూరు, కర్నూలుకు వచ్చే వాహనాలను కూడా దారి మళ్లించి గిద్దలూరు, నంద్యాల మీదుగా మళ్లించారు. నీటి ప్రవాహ ఉధృతి అధికంగా ఉండటం వల్ల ఇరువైపుల పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసి అప్రమత్తమైన చర్యలు చేపట్టారు.



కర్నూలు - గుంటూరు రహదారిపై సిద్ధాపురం జలాల ఉధృతి



లీకేజీ నీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బుడ్డా

ఉల్లిగడ్డలు వదిలేశారు..

మద్దికెర, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దికెర, ఎం.అగ్రహారం, బురుజుల గ్రామాల్లో రైతులు నల్లరేగడి పొలాల్లో ఉల్లి పంటను సాగు చేశారు. అత్యధిక వర్షాలతో పాటు గత మూడు రోజుల నుంచి వర్షాలు అధికంగా వస్తుండటంతో రైతులు సాగు చేసిను ఉల్లిగడ్డలు కుల్లిపోవడంతో రైతులు పొలం గట్టుపైనే వదిలేశారు. దాదాపు 10వేల ఎకరాల్లో ఉల్లి పంటను సాగు చేయగా.. గిట్టుబాటు ధర లేకపోవడం దానికి తోడు ఉల్లిగడ్డ కులిపోవంతో ఉల్లిని పెకిలించినా లాభం లేదన్న భావనతో ఉల్లిగడ్డలను దున్నేసి పొలంగట్టులో గొర్రెలు, మేకలకు వదిలేశారు. ఎకరాకు రూ.20వేల వరకు పెట్టుబడి పెట్టామని, నష్టపోయామని ప్రభుత్వం ఉల్లి రైతులను ఆదుకోవాలని కోరారు.

దేవనకొండ:

రైతు ఆరుగాలం శ్రమించి పంటను పండిస్తే ధర పతనంతో ఉల్లి పంట గొర్రెలకు మేతగా మారుతుంది. దేవనకొండ మండలం కరిడికొండకి చెందిన మహబుబ్‌బాష ఎకరన్నలో రూ.1.80 లక్షలతో ఉల్లి పంట సాగు చేశారు. ధర వస్తుందని ఆశతో ఎదురుచుస్తూ, పంటను అలాగే పొలంలోనే కొనసాగించాడు.గడువు ముగియడంతో పంటను పికి, కోత కొసి, గ్రేండింగ్ చేసేందుకు కూలీలకు రూ.80 వేల ఖర్చు అడగగా, కొసిన పంటను విక్రయానికి తరలించేందుకు వాహనం ఖర్చు రూ.20 వేలు తో కలుపుకొని రూ. లక్ష భరించలేకపోవడంతో బుధవారం కష్టపడిపండించిన పంటను గుండెభారంతో గొర్రెలకు మేతగా వదిలాడు.



మద్దికెరలో గట్టుపైనే వదిలేసిన ఉల్లి గడ్డలు

అంగన్‌వాడీల ఇంటర్వ్యూలు వాయిదా

- సీడీపీఓ లలిత

పత్తికొండ టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్, ఆయా పోస్టులకు సంబంధించిన ఇంటర్వ్యూలు నేడు (గురువారం) జరగాల్సి ఉండగా, అనివార్య కారణాల రీత్యా వాయిదా పడినట్లు సీడీపీఓ లలిత తెలిపారు. తుఫాన్ ప్రభావితం కారణంగా ఇంటర్వ్యూలను వాయిదా వేయడం జరిగిందన్నారు. త్వరలోనే ఇంటర్వ్యూ తేదీని ప్రకటిస్తామన్నారు. దరఖాస్తులు చేసిన అభ్యర్థులు గమనించాలన్నారు.

వెలుగోడు రిజర్వాయర్ గేట్లు ఎత్తివేత

వెలుగోడు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వెలుగోడు మండలంలో బుధవారం కురిసిన భారీ వర్షానికి వరద ప్రవాహం పోటెత్తింది. దీంతో వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు భారీగా వరద చేరడంతో గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. మండలంలోని బోయరేవుల, మాధవరం వంతెనలు నీట మునగడంతో రాకపోకలు నిలిచిపోయాయి. వేల్పనూరు రహదారిలోని మంచినీళ్ళవాగు ఉప్పొంగడంతో వాహన రాకపోకలు నిలిచిపోయాయి. వెలుగోడులోని సీపీ నగర్, ద్వారకనగర్, చెంచుకాలనీ, పాతబస్టాండ్‌తో పాటు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వరద ప్రాంతాలను జాయింట్ కలెక్టర్ కార్తీక్, తహసీల్దార్ శ్రీనివాసగౌడ్, ఎంపీడీవో మధుసూధన్‌రెడ్డి పరిశీలించారు.



జలాశయం గేట్లు ఎత్తి దిగువకు నీరు విడుదల చేస్తున్న దృశ్యం

పూర్తి సెక్యూరిటీ సిబ్బందిని నియమించాలి

• ఏజెన్సీని ఆదేశించిన సూపరింటెండెంట్



ఏజెన్సీ ప్రతినిధులతో మాట్లాడుతున్న సూపరింటెండెంట్

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పెద్దాసుపత్రిలో పూర్తిస్థాయి (238 మంది) సెక్యూరిటీ సిబ్బందిని నియమించాలని ఈగల్ సెక్యూరిటీ సర్వీసెస్ ఏజెన్సీ ప్రతినిధులను సూపరింటెండెంట్ డా.కె వెంకటేశ్వర్లు ఆదేశించారు. బుధవారం సాయంత్రం తన ఛాంబర్‌లో డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో డా. వెంకటరమణ అడ్మినిస్ట్రేటర్ సింధూ సుబ్రహ్మణ్యంతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఇన్‌గేట్ న్యూ డయోగ్నస్టిక్ బ్లాక్, మాతా శిశు సంరక్షణ కేంద్రం వద్ద రోగుల రద్దీ ఎక్కువగా ఉందని, ట్రాఫిక్‌ను నియంత్రించాలని సూచించారు. నవంబరు 30వ తేదీలోపు సిబ్బంది నియామకం పూర్తిచేయాలన్నారు. ఏజెన్సీ ఆపరేషన్ మేనేజర్ శంకర్, చీఫ్ ఎస్‌వో కేజే రెడ్డి పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

• డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్



కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ముసురు, వాతావరణ మార్పు ప్రభావంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాకాధికారి డా.ఎల్.భాస్కర్ సూచించారు. బుధవారం మాట్లాడుతూ ప్రస్తుతం డెంగీ, మలేరియా ప్రబలే ప్రమాదం ఉందని హెచ్చరించారు. నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని దోమతెరలు వాడాలని, కిటికీలకు మెష్ ఏర్పాటు చేసుకోవా లన్నారు. పిల్లలకు కాళ్ల చేతుల వరకు నిండుగా ఉండే దుస్తులు ధరింపజేయాలన్నారు. వేడిగా ఉండే ఆహార పదార్థాలను తయారు చేసుకుని తినాలని, ఆహార పదార్థాలపై ఈగలు వాలకుండా వంట పాత్రలపై మూతలు ఉంచాలన్నారు.

నగర ప్రగతే అజెండా

• మేయర్ బీవై రామయ్య
• రూ.9.23 కోట్ల అభివృద్ధి పనులకు ఆమోదం

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగర ప్రగతే ప్రధాన అజెండా అని నగర పాలక సంస్థ మేయర్ బీవై రామయ్య అన్నారు. బుధవారం కార్యాలయంలో స్థాయిసంఘ సమావేశం నిర్వహించారు. కమిషనర్ పి. విశ్వనాథ్, సభ్యులు షేక్ అహ్మద్, ఇప్పల నారాయణ రెడ్డి, మునెమ్మ, వై. వెంకటేశ్వర్లు, సాంబశివరావు హాజరయ్యారు. రూ.9.23 కోట్ల విలువైన వివిధ పనులకు సంబంధించి 36 అజెండాలను ఆమోదించారు. అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, మేనేజర్, చిన్న రాముడు, ఇన్‌చార్జి ఎస్ఈ శేషసాయి, అధికారులు పాల్గొన్నారు.

2న జిల్లా స్థాయి కబడ్డీ జట్టు ఎంపిక

కర్నూలు స్పోర్ట్స్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): నవంబరు 2వ తేదీన మంత్రాలయం మండలం విద్యానగర్ ఎస్ఎంకేవీ ప్రభుత్వ పాఠశాలలో కబడ్డీ ఎంపిక నిర్వహిస్తున్నట్లు చావిడి వెంకటేశ్, వలకలదిన్నె వెంకటేశ్ తెలిపారు. జిల్లా కబడ్డీ సంఘం ఆధ్వర్యంలో బాలురు 60 కేజీలు, బాలికలు 55 కేజీలలోపు ఉండాలన్నారు. 1-12-2009 తర్వాత జన్మించిన వారు అర్హులుని, వివరాలకు 9177320094 నంబర్లో సంప్రదించాలన్నారు.

31న వాలీబాల్ జట్టు రిపోర్ట్ చేయాలి

నవంబరు 1, 2, 3 తేదీల్లో పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరులో అండర్-17 రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నఆరు. ఈ పోటీలకు హాజరయ్యే కర్నూలు జిల్లా జట్టు ఈ నెల 31న ఉదయం 10 గంటలకు కర్నూలులోని డీఎస్ఏ ఔట్‌డోర్ స్టేడియం రిపోర్టు చేయాలని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి టి.కృష్ణ తెలిపారు.

• లాన్ టెన్నిస్ అండర్-14,1 67 బాలబాలికల జిల్లా క్రీడాకారులు ఈ నెల 31న డీఎస్ఏ స్టేడియంలో రిపోర్టు చేయాలన్నారు. నవంబరు 1 నుంచి 3 వరకు శ్రీ కాళహస్తిలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలకు హాజరు కావాలని కార్యదర్శి తెలిపారు.


హరికిషన్‌కు సాహిత్య పురస్కారం



పురస్కారం అందజేస్తున్న యూనివర్సిటీ ప్రతినిధులు

కర్నూలు కల్చరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కర్నూలుకు చెందిన బాల సాహితీవేత్త, కవి డాక్టర్ ఎం. హరికిషన్ బాలసాహిత్య పురస్కారం అందుకున్నారు. హైదరాబాదులోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వ విద్యాలయం బుధవారం అందచేసింది. యూనివర్సిటీ అధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు, రాజమండ్రి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం అధ్యక్షుడు మునిరత్నం నాయుడు, ఆకాశవాణి హైదరాబాదు కేంద్రం విభాగాధిపతి ఎస్ రమేశ్ చేతుల మీదుగా అందజేశారని హరికిషన్ తెలిపారు. కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, కార్యదర్శి సి. యాగంటీశ్వరప్ప, ముద్రిక భాస్కర్, చిన్నావుల వెంకట రాజారెడ్డి అభినందించారు.

భారీ వర్షంతో కూలిన మట్టిమిద్దె



ఓర్వకల్లు మండలంలో కూలిన మట్టిమిద్దె

ఓర్వకల్లు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో మొంథా తుఫాన్ ప్రభావంతో వర్షం కురవడంతో బుధవారం మట్టిమిద్దెలు కూలాయి. సోమయాజులపల్లె మజరా గ్రామం చెన్నంచెట్టిపల్లెకు చెందిన బోయ రామాంజనేయులుకు చెందిన మిద్దె కూలిది. ఆ సమయంలో కుటుంబ సభ్యులు బయట ఉండటంతో ప్రమాదం తప్పింది. పంచాయతీ కార్యదర్శి లక్ష్మీకాంతరెడ్డి పరిశీలించారు. అలాగే చింతలపల్లె గ్రామంలో గొల్ల లచ్చమ్మకు చెందిన మట్టిమిద్దె ఉదయం 6 గంటల సమయంలో కూలింది. ఇంట్లోని సైపులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

కూలీలకు నిత్యావసరాల పంపిణీ

కర్నూలు కల్చరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వర్షాల కారణంగా ఉపాధి కోల్పోయిన దినసర కూలీలకు రోజా మహిళా సంఘం అధ్యక్షురాలు మీసాల సుమలత, విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మురారి శంకరప్ప నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. బుధవారం 48వ వార్డు రోజా వీధిలో సరుకులు అందజేశారు. ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కోరారు.

గోనె సంచులకు నిప్పు

• రూ 5.5 లక్షల దాకా నష్టం
• పరిశీలించిన టీడీపీ నాయకులు



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఎమ్మిగనూరు టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు వెనుక ఉన్న గోడౌన్ల వద్ద బుధవారం వేకువజామున గుర్తు తెలియని వ్యక్తులు గోనె సంచులకు నిప్పు పెట్టారు. దీంతో ఆ ఖాళీ సంచులు కాలి బూడిద య్యాయి. వ్యవసాయ మార్కెట్ అధికారులు తెలిపిన వివరాలివీ.. మార్కెట్ వెనుక వైపున 8 గోడౌన్‌లు ఉన్నాయి. ఇందులో కొంత మంది వ్యాపారులు ఖాళీ సంచులు వేసుకొని తమ వ్యాపారాలను కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగానే 500 ఖాళీ సంచుల గట్టాలు (25 వేలకుపైగా ఖాళీ సంచులు) తెచ్చుకొని పెట్టుకున్నారు.

బుధవారం తెల్లవారుఝామున గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు అంటించగా మంటలు ఎగసి పడుతుండటంతో అక్కడ సమీపంలో ఉన్న కూరగాయల మార్కెట్ వారు, వ్యవసాయ మార్కెట్ అధికారులు మంటలు ఆర్పడానికి ప్రయత్నించారు. అప్పటికీ మంటలు అదుపు కాకపోవడంతో, ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించగా ఫైర్ స్టేషన్ సిబ్బంది వచ్చి మంటలను ఆర్పి అదుపు చేశారు. అప్పటికే భారీగా నష్టం జరిగింది. ఫైర్ స్టేషన్ సీఐ రామాంజనేయులు మాట్లాడుతూ గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారని, వీరేష్‌కు రూ.50 వేలు, మహబూబ్ బాషాకు రూ.5 లక్షలు వరకు ఆస్తి నష్టం జరిగిందని తెలిపారు. సమాచారం అందుకున్న మార్కెట్ యార్డు సెక్రటరీ చంద్రమౌళి, మార్కెట్ యార్డు చైర్మన్ మల్లయ్య, టీడీపీ సీనియర్ నాయకులు భాస్కర్ల చంద్రశేఖర్, ఎస్ఐ మధుసూదన్ రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

మా అమ్మను కాపాడండి

• తండ్రి హింసిస్తున్నాడని చిన్నారి ఫిర్యాదు



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బాలుడు

నంద్యాల టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : తల్లిని తన తండ్రి హింసిస్తున్నాడని ఏడుస్తూ ఏడేళ్ల బాలుడు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన సంఘటన నంద్యాలలో చోటుచేసుకుంది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు సాయిబాబనగర్‌కు చెందిన జయమ్మ భర్త రాంభూపాల్ వేధింపులు తాళలేక ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది.

దీంతో స్థానికులు నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తండ్రి రాంభూపాల్ ఆసుపత్రి వద్దకు వచ్చి కూడా తల్లిని వేధిస్తుండడంతో తట్టుకోలేని ఏడేళ్ల చిన్నారి బాలుడు ప్రభుత్వాస్పత్రి నుంచి నేరుగా టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి తండ్రి రాంభూపాల్‌పై ఫిర్యాదు చేశాడు. పోలీసులు స్పందించి రాంభూ పాల్‌కు కౌన్సెలింగ్ ఇచ్చి ఇటువంటివి పునరావృతం కాకుండా చూడాలని హెచ్చరించారు. చిన్నారిని తల్లి వద్దకు చేర్చారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

మహానంది, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మహానంది మండలం నందిపల్లి మెట్ట వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సీతారామపురం గ్రామానికి చెందిన చిన్న నరసింహుడు(71) అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. చిన్న నరసింహుడు గిద్దలూరు-నంద్యాల రహదారిలోని నందిపల్లి మెట్ట వద్ద నడిచి వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీ కొంది. ఈసంఘటనలో అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

టీడీపీలో బీసీలకు అగ్రస్థానం

• రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర



మాట్లాడుతున్న తుగ్గలి నాగేంద్ర

మద్దికెర, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): టీడీపీ హయాంలో బీసీలు, సామాన్యులకు అగ్రస్థానం ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర అన్నారు. బుధవారం ఆయన మండలంలోని పెరవలిలో విలేకరులతో మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాలకు తెలుగుదేశం పార్టీ మొదటి నుంచి అవకాశం కల్పిస్తోం దన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి బీసీలు వెన్నెముకగా నిలిచారన్నారు. అదేవిధంగా శాసనమండలిలో కుమ్మరి, నాయీ బ్రాహ్మణులకు ప్రాతినిధ్యం ఉండేలా అవకాశం కల్పించాలని ఆయన కోరారు. ఈ మేరకు సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్‌ను కూడా పలుమార్లు కలిశామన్నార మాదాసి, మాదారి సంఘం నాయకులు శివలింగప్ప, మండల టీడీపీ అధ్యక్షులు నారాయణ, పెరవలి రామాంజనేయులు బాకిక ఆంజనేయ, రవీంద్ర, చందు తదితరులు ఉన్నారు.

ఉల్లి రైతు కుదేలు

• నష్టపోయాం.. ఆదుకోవాలని రైతుల ఆవేదన



ఆవులపల్లెలో నీట మునిగిన ఉల్లిగడ్డలు

చాగలమర్రి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో రైతన్నలు కుదేలయ్యారు. మండలం లోని ఆవులపల్లె గ్రామంలో చేతికొచ్చిన ఉల్లిపంటను కోత కోసి పంట పొలంలోనే ఆర బెట్టారు. తుఫాన్ దెబ్బతో 60 ఎకరాల్లో ఉల్లి పంట తడిచి దెబ్బతింది. గ్రామానికి చెందిన శ్రీనివాసులు 4 ఎకరాలు, చిన్న నరసింహులు 2, రమ ణయ్య 2, లక్ష్మీనర్సయ్య 3, రామకృష్ణయ్య 4, మరో 15 మంది రైతులకు చెందిన ఉల్లిపంట దెబ్బతిని నష్టం వాటిల్లింది. అసలే ధర లేక అల్లాడుతుంటే తుఫాన్ దెబ్బ తో ముంచేసిందని రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి పరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరారు.

డీఈడీ 3వ సెమిస్టర్ ఫలితాలు విడుదల

కర్నూలు అర్బన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీలో మేలో జరిగిన 3వ సెమిస్టర్ రీ వాల్యుయేషన్ పరీక్షల ఫలితాలను ఉపకులపతి వి. వెంకట బసవరావు విడుదల చేశారు. 1098 మంది దరఖాస్తు చేసుకోగా, 955 మంది ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు వర్శిటీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని తెలిపారు.

ఎంఎస్ఎంఈ పార్కుకు 31.19 ఎకరాలు

• ఏపీఐఐసీకి కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

కర్నూలు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణానికి ఐదు కిలోమీటర్లు దూరంలో ఎంఎస్ ఎంఈ పార్కు ఏర్పాటు కోసం ఏపీఐఐసీకి 31.19 ఎకరాల ప్రభుత్వ భూమి కేటాయిస్తూ బుధవారం ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. పెద్దకడుబూరు మండలం హనుమాపురం గ్రామం సమీపంలో సర్వే నంబరు 1161 (ఎల్‌పీఎం నంబరు.5968)లోని 31.19 ఎకరాల ప్రభుత్వ భూమిని ఎంఎస్ఎంఈ పార్క్ స్థాపన కోసం ఏపీఐఐసీ కేటాయించారు.

ఉద్యోగుల నియామకంపై విచారణ చేయాలి



వీసీకి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

కర్నూలు అర్బన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఆర్‌యూలో ఉద్యోగుల నియామకంపై విచారణ చేయాలని అంబేద్కర్ స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.రాఘవేంద్ర డిమాండ్ చేశారు. బుధవారం వీసీ వి. వెంకట బసవరావుకు వినతి పత్రం ఇచ్చారు. వర్శిటీలో నియామకాలకు గరిష్ట వయస్సు 42 ఏళ్ల కాగా, అధిక వయస్సువారిని డైరెక్ట్, తాత్కాలిక నియామ కాల్లో నియమించి, ప్రొబేషనరీ ఇచ్చి, ఎస్ఆర్‌ను చేసినట్లు ఫిర్యా దు చేశారు. విచారణ చేయించి చర్యలు తీసుకోవాలని కోరారు.

కురువ సంఘం నూతన కమిటీ



ఎన్నికైన కురువ సంఘం సభ్యులు

డోన్ టౌన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణ కురువ సంఘం నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా బింగి పరమేశ్వరుడు, బంగారు రంగనా థమయ్య, అధ్యక్షుడిగా అడ్వకేట్ కే. లక్ష్మన్న, ఉపాధ్యక్షులుగా కే.శ్రీనివాసులు, కే.తిరుపాలు, జాలపతి రాముడు, ప్రధాన కార్య దర్శిగా దండు సూర్య నారాయణ, సహాయ కార్యదర్శులు డొక్కా చంద్రశేఖర్, పెయింటర్ బాలు, ఆర్‌టీసీ మద్దిలేటి, తుందూరు మహేష్, కార్యవర్గ సభ్యులుగా జి.రమేష్ (ఆర్ఎంపీ), కే.తిప్పన్న, కే.రంగన్న, కే.చిన్న గంగాధర్, బి.చంద్రశేఖర్, బి.విజయ్, అధికార ప్రతినిధిగా కురువ మధు, గౌరవ సభ్యులుగా బి.రామాంజనే యులు, మారెళ్ల వెంకట్రాముడు, మొబైల్ క్యాంటీన్ పెద్దయ్య తదితరులను ఎన్నుకున్నారు.

తుఫాన్ నష్టంపై నివేదిక ఇవ్వండి



విజయ లక్ష్మి

అవుకు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో తుఫాన్‌తో దెబ్బతిన్న పంటలు, ఆస్తి నష్టంపై నివేదకలు తయారుచేసి అందించాలని స్పెషలాఫీసర్ విజయ లక్ష్మి అధికారులను ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ కార్యాల యానికి చేరుకొని తహసీల్దార్ మల్లికార్జునరెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసులుతో సమావేశం నిర్వహించారు. మండల వ్యాప్తంగా ఖరీఫ్‌లో అత్యధికంగా వరి 12,300 ఎకరాలు, మొక్కజొన్న 5,700 ఎకరాల్లో సాగయిందన్నారు. మండలంలో 27, 28 తేదీల్లో 47.6 మి.మీ వర్షం మాత్రమే పడిందన్నారు. వర్షం తగ్గటంతో క్షేత్రస్థాయిలో పర్యటించి దెబ్బతిన్న పంటలు, కూలిన ఇళ్లను పరిశీలించి నివేదిక అందిస్తే ఉన్నతాధికారులకు పంపుతామన్నారు.



కొనుగోళ్లను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ జిందే శారద శంకర్

సీసీఐ పత్తి కొనుగోళ్లు ప్రారంభం

ఆదోని అగ్రికల్చర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పత్తి రైతులను ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్ శారద శంకర్ పేర్కొన్నారు. బుధవారం పట్టణ శివారు ప్రాంతంలోని ఎన్‌డీబీఎల్ జిన్నింగ్ పరిశ్రమలో కనీస మద్దతులతో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) పత్తి కొనుగోళ్లను ప్రారం భించింది. ముందుగా ఆమె మార్కెట్ యార్డ్ సెక్రటరీ గోవిందు, పరిశ్రమ యాజమాని బత్తిని కుబేర్‌నాథ్, సీసీఐ ప్రతినిధి శ్రీనివాసులు, వైస్ చైర్మన్ ఆదూరి విజయ్ కృష్ణ, డైరెక్టర్లతో కలిసి పూజలు చేసి ప్రారంభించారు. తుఫాన్ ప్రభావం అధికంగా ఉన్నప్పటికీ పత్తి రైతులు నష్టపోకుండా కనీస మద్దతు ధరతో క్వింటాలు రూ.8,110తో సీసీఐని రంగంలో దించి కొనుగోలు చేస్తున్నామ న్నారు. ప్రభుత్వం సూచించిన విధంగా ముందుగా ఆర్ఎస్‌కేలలో తమ వివరాలు నమోదు చేసుకుని కిసాన్ కాపాస్ యాప్‌లో స్లాట్ బుకింగ్ చేసుకోవాలని సూచించారు. పత్తి తేమ 8 శాతం నుండి 12 శాతం లోపు ఉండాలని అన్నారు. డైరెక్టర్లు వెంకటేష్, రమాకాంత్ రత్నాబాయి, కాశన్న సహాయ కార్యదర్శి శాంతకుమార్, సూపర్‌వైజర్లు రాము, మోహన్ రెడ్డి, షబ్బీర్, భాషా, అశోక్ పాల్గొన్నారు.

ప్రతి రైతును ఆదుకుంటాం: కలెక్టర్



మొక్కజొన్న రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

రుద్రవరం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకుంటుందని కలెక్టరు రాజకుమారి గనియా అన్నారు. బుధవారం రుద్రవరం మండలం ఆలమూరులో నష్టపోయిన పంటలను ఆమె పరిశీలించారు. కలెక్టరుకు మొలకెత్తిన మొక్కజొన్నలు, దెబ్బతిన్న బొప్పాయి చెట్లను చూపించి రైతులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టరు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో 67వేల హెక్టార్లలో మొక్కజొన్న, 65వేల హెక్టార్లలో వరి పంటలు రైతులు సాగు చేశారని, మొక్క జొన్న పంటలో 30 శాతం మాత్రమే కోతలు కోసి కుప్పలు పోశారని, ఇంకా 70శాతం మొక్కజొన్న పంట కోత కోయాల్సి ఉందన్నారు. అధికారుల బృందం జిల్లాలో ప్రతి గ్రామాన్ని సందర్శించి ప్రతి రైతును విచారించి సర్వే చేస్తారన్నారు. జిల్లాలో 21 వాగులు వంకలు పొంగి ప్రవహించాయ న్నారు. ఉద్యానశాఖ, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా తమ పరి ధిలో ఉన్న పంటలను నష్టపోయిన రైతులను విచారించి జాబితా సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వానికి నాలుగురోజుల్లో నష్టంపై నివేదికలు పంపిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లాఉద్యాన శాఖాధికారి నాగరాజు, ఏడీ విజయశేఖర్, ఏవో సుమతి, సాగునీటి సంఘం అధ్యక్షులు బ్రహ్మయ్య, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పంట కోతలు వాయిదా వేసుకోండి



వరి పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి మద్దిలేటి

సంజామల, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ తీవ్రత తగ్గే వరకు పంట కోతలు వాయిదా వేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి మద్దిలేటి రైతులకు సూచించారు. బుధవారం ముదిగేడు గ్రామంలో వ్యవసాయ సహాయ సంచాలకులు సుధాకర్, ప్రాంతీయ వ్యవసాయ పరిధోన శాస్త్రవేత్త రవిప్రకాష్, సవిత, రమాదేవి, మండల వ్యవసాయ అధికారిని జ్యోతితో కలిసి ఆయన దెబ్బతిన్న వరి పంట, మొక్కజొన్న తదితర పంటలను పరిశీలించారు. వ్యవసాయ భూముల్లో మిరప, కంది పంటల్లో వర్షపు నీరు నిల్వ లేకుండా బయటికి పంపించాలన్నారు.

నేడు అధికారులతో మంత్రి సమీక్ష


బనగానపల్లె, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కోవెలకుంట్ల పట్టణంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో సంజామల, కోవెలకుంట్ల మండలాలకు చెందిన వివిధ శాఖల అధికారులతో గురువారం అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నటు రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి బుధవారం తెలిపారు. బనగానపల్లె మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సంజామల, కోవెలకుంట్ల మండలాలకు చెందిన వ్యవసాయ, ఎస్పార్బీసీ, ఆర్ అండ్‌బీ, ఇరిగేషన్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అధికారులు తమకు సంబంధించిన నివేదికలతో రావాలని మంత్రి కోరారు. 4 శాఖలపై రివ్యూ సమావేశం నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు.

ప్రజా ఉద్యమాలతోనే పార్టీ బలోపేతం

సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు

కొలిమిగుండ్ల, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రజా ఉద్యమాలతోనే పార్టీ బలోపేతం అవుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు అన్నారు. మండలంలోని బెలుం గుహల ఆవరణలో గత మూడు రోజులుగా జరుగుతున్న సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుల శిక్షణా తరగతులు బుధవారం ముగి శాయి. జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, రైతు సంఘం నాయకులు పుల్లయ్య, పెద్దయ్య, సూరి, మహేష్ పాల్గొన్నారు.

దారి ఏదీ?



సి. బెళగల్ మండలం బ్రాహ్మణదొడ్డి నుంచి క్రిష్ణదొడ్డికి వెళ్లే రహదారి ముళ్లకంపతో నిండి ఉంది. దాదాపు 7 కి.మీ. మట్టిరోడ్డు, చుట్టూ కంప ఉండటంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ దారిలోనే రైతులు పొలాలకు వెళతుతున్నారు. ఏ మాత్రం అదుపు తప్పినా కంపలో పడిపోయే అవకాశముంది. అధికారులు స్పందించి ముళ్లకంప తొలగించి, సీసీ రోడ్డు నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు.
- సి. బెళగల్

పూర్తయ్యేది ఎన్నడు?



తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ప్రభుత్వ విశ్రాంతి భవనం అసంపూర్తిగా నిలిచిపోయింది. దాదాపు 15 ఏళ్ల క్రితం పనులు ప్రారంభించి నిధుల కొరత కారణంగా నిలిపివేశారు. చుట్టూ మురుగు చేరి పారిశుధ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ఇప్పటికే తహసీల్దార్ కార్యాలయం శిథిలావసకు చేరి అవస్థలు పడుతున్నారు. ఈ భవానిన్ని పూర్తి చేస్తే తహసీల్దార్ కార్యాలయంగా ఉపయోగించవచ్చు. ప్రజా ప్రతినిధులు నిధులు మంజూరు చేసి పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని సిబ్బంది, ప్రజలు కోరుతున్నారు. - గూడూరు

పోలీసు క్రీడాకారిణికి ఎస్పీ అభినందన

కర్నూలు క్రైం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా పోలీస్ జూడో క్లస్టర్ గేమ్స్‌లో వెండి, కాంస్యం పతకాలు సాధించిన ఆర్ఎస్ఐ పి.కల్పనను ఎస్పీ విక్రాంత్ పాటిల్ అభినందించారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆమె ఎస్పీని కలిశారు. అక్టోబరు 8 నుంచి 16 వరకు జమ్మూ కశ్మీర్‌లో 10వ జాతీయ పోలీస్ జూడో క్లస్టర్ పోటీల్లో రాష్ట్రం తరఫున కల్పన పాల్గొన్నారు. పెన్కాక్ సిలాట్‌లో వెండి పతకం, కరాటేలో కాంస్యం సాధించారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాదించాలని జిల్లా పోలీసు శాఖకు పేరు తీసుకురావాలని ఎస్పీ సూచించాంచారు. ఆర్ఐ జావేద్ ఉన్నారు.


కల్పనతో ఎస్పీ విక్రాంత్ పాటిల్

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే దస్తగిరి

సి.బెళగల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కంబందహాల్ గ్రామానికి చెందిన నాగన్న కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే దస్తగిరి రూ.49,578 చెక్కును బుధవారం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందూ నాగన్న మృతిచెందడంతో కుటుంబానికి చెక్కు మంజూరైందన్నారు. సర్పంచ్ భర్త రాముడు, ఎంపీటీసీ సత్యారెడ్డి ఉన్నారు.

కూలీలు ఈకేవైసీ చేయించుకోవాలి

ఓర్వకల్లు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలు నెలాఖరులోగా ఈకేవైసీ చేయించుకోవాలని ఏపీవో మద్దేశ్వరమ్మ సూచించారు. బుధవారం మాట్లాడుతూ నెల రోజులుగా వ్యవసాయాధికారులు గ్రామాల్లో ఈకేవేసీ చేస్తున్నారన్నారు. మండలంలో ఇప్పటి వరకు 86 శాతం కూలీలు మాత్రమే ఈకేవైసీ చేయించుకున్నారని, మిగతావారు కూడా చేయించుకోవాలన్నారు. ఈకేవైసీ చేయించుకోకపోతే పనికి వెళ్లేందుకు వీలుండదన్నారు.

ఆత్మసాక్షితో విధులు నిర్వహించాలి

- జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ



కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు ఆత్మసాక్షితో విధులు నిర్వహించాలని డీఆర్వో వెంకటనారాయణమ్మ సూచించారు. బుధవారం ఉదయం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్- 2025 నిర్వహించారు. 31వ తేదీన దివంగత ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా నవంబరు 22వ తేదీ వరకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఏసీబీ డీఎస్పీ సోమన్న మాట్లాడుతూ వారం పాటు అవినీతి నిరోధకంపై అవగాహన కల్పిస్తామన్నారు.

పత్తి కొనుగోళ్లు ప్రారంభం


పెంచికలపాడులో కొనుగోళ్లను ప్రారంభిస్తున్న అధికారులు

కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గూడూరు మండలం పెంచికలపాడులోని జిన్నింగ్ మిల్లులో మార్కెటింగ్ శాఖ ఏడీఎం నారాయణమూర్తి, కోడుమూరు మార్కెట్ కమిటీ సెక్రటరీ సుందర్‌రాజు, సీసీఐ అధికారులు బుధవారం పత్తి కొనుగోళ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏడీఎం నారాయణమూర్తి మాట్లాడుతూ జిల్లాలోని పెంచికలపాడు, ఎమ్మిగనూరు, ఆదోని, మంత్రాలయం జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోళ్లను ప్రారంభిచామన్నారు. గురువారం నుంచి సీసీఐ అధికారులు కొనుగోలు చేస్తారని, ముందుగా రైతులు గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో ఈక్రాప్ నమోదు చేయించి, కాపస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నాణ్యత ప్రమాణాలను అనుసరించి రైతుల నుంచి కొనుగోలు చేస్తారని స్పష్టం చేశారు. 8 శాతం లోపు తేమ ఉంటే క్వింటం రూ.8,110లు చెల్లిస్తారని తెలిపారు. రైతులు తప్పనిసరిగా నాణ్యమైన పత్తిని తీసుకురావాలని, గ్రామాల్లో దళారులను నమ్మి తక్కువ మొత్తానికి అమ్ముకోవద్దని సూచించారు.

మహాసభను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ఉదయ్‌కుమార్

కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): భారత ఐక్య విద్యార్థి సమైఖ్య రాష్ట్ర ప్రథమ మహాసభలను జయప్రదం చేయాలని యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి సందేపోగు ఉదయ్ కుమార్ పిలుపునిచ్చారు. గురువారం మాట్లాడుతూ జడ్పీ కాన్ఫరెన్స్ హాల్లో సభ ఉంటుందని విద్యార్థులు పెద్ద ఎత్తున హాజరై విద్యారంగ సమస్యల పరిష్కారానికై కృషి చేయాలన్నారు. సందీప్, ఆర్యన్, ప్రేమ్ కుమార్, అనిల్ కుమార్, అశోక్ కుమార్ ఉన్నారు.

'ఈట్ స్ట్రీట్' ఏర్పాటుకు లక్కీ డ్రా


డ్రా నిర్వహిస్తున్న కమిషనర్ విశ్వనాథ్, అధికారులు

కర్నూలు కల్చరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): నగరంలోని స్టేడియం రోడ్డులో ఏర్పాటు చేయనున్న 'ఈట్ స్ట్రీట్'కు బుధవారం కమిషనర్ విశ్వనాథ్ లక్కీ డ్రా నిర్వహించారు. 60 దుకాణాల ఏర్పాటుకు ప్రణాళిక రూపొందించగా 38 షాపులను లక్కీ డ్రా ద్వారా కేటాయిం చారు. నగర అభివృద్ధిలో భాగంగా ప్రజల విహారానికి, చిన్న వ్యాపారుల ఉపాధి కల్పనకు ఈట్ స్ట్రీట్ కీలకంగా నిలుస్తుందన్నారు. 700 అడుగల వెడల్పులో ఒక్కో స్టాల్‌ను 120 అడుగల విస్తీర్ణంలో ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్‌కుమార్ రెడ్డి, ఎంఈ మనోహర్‌రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, సూరింటెండెంట్ సుబ్బన్న, టీపీవో అంజాద్ బాషా, సీఎంఎం భాస్కర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగులను దూషించకూడదు

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉన్నతాధికారులు కిందిస్థాయి ఉద్యోగులను దూషించకూడదని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు బంగి శ్రీధర్ కోరారు. బుధవారం మాట్లాడుతూ చిత్తూరు వాణిజ్య పన్నుల శాఖలో సబ్ ఆర్డినేట్లను జాయింట్ కమిషనర్ దూషించడం అర్థరహితమన్నారు. సురేష్ రెడ్డి, మురళిధర్, చెన్నకృష్ణ, సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బంగి శ్రీధర్

హెచ్‌డీఎస్ సమావేశం నిర్వహించండి

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు సంబంధించి హాస్పిటల్ డెవలప్‌మెంట్ కమిటీ సమావేశాన్ని నిర్వహించాలని సభ్యుడు పీటీ సాయిప్రదీప్ కలెక్టర్ డా.ఏ.సిరికి వినతి పత్రం అందజేశారు. జీవో.నెం.120 ప్రకారం మూడునెలలకోసారి నిర్వహించాల్సి ఉండగా, గత ఏప్రిల్‌లో నిర్వహించారని, ఆరు నెలలైనా మరలా నిర్వహించలేదన్నారు. ఆసుపత్రి పాలన గాడి తప్పిందని, రోగులకు తాగునీరు లేదని, పారిశుధ్య నిర్వహణ సరికాలేదన్నారు. ఇన్‌గేటు వద్ద ట్రాఫిక్ అస్థవ్యస్తంగా ఉందన్నారు. స్పందించిన కలెక్టర్ వచ్చే నెలలో నిర్వహిస్తామని హామీ ఇచ్చారు.

మోటర్లను తాకవద్దు

సి.బెళగల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తున్నందున రైతులు విద్యుత్ మోటర్లను తాకవద్దని విద్యుత్ ఏఈ సుకుమార్ సూచించారు. బుధవారం మండలంలోని గుండ్రేవుల, బురాన్‌దొడ్డి, పోలకల్లు, సిబెళగల్, కొత్తకోట గ్రామాల్లో పర్యటించి రైతులు, వినియోగదారులకు అవగాహన కల్పించారు.

భక్తి చైతన్య యాత్రకు తరలిరండి

కల్లూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): నవంబరు 1న కర్నూలు పాతబస్టాండు చెన్నకేశవ స్వామి ఆలయంలో ప్రారంభించనున్న మహా పాదయాత్రకు భక్తులు తరలిరావాలని అధ్యక్ష, ఉపాధ్యక్షులు పాలూరు శివయ్య, పబ్బతి క్రిష్ణ కోరారు. బుధవారం మహా పాదయాత్ర పోస్టర్ విడుదల చేశారు. కార్తీకమాసం సందర్భంగా కర్నూలు నుంచి 14వ సారి వెంకటేశ్వరస్వామి రథంతో పాదయాత్ర నిర్వహిస్తున్నామన్నారు. కర్నూలు, కాల్వబుగ్గ, బేతంచెర్ల, బనగానపల్లె, నొస్సం, జమ్ములమడుగు, ప్రొద్దుటూరు, మైదుకూరు, కడప, రాజంపేట, రైల్వేకోడూరు, తిరుచానూరు మీదుగా తిరుపతి చేరుకుటుందన్నారు.


పోస్టర్ విడుదల చేస్తున్న సభ్యులు

కాలువల్లో పూడికతీత


ఎక్స్‌కవేటర్‌తో చేస్తున్న పనులు

గూడూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ పరిధిలోని కర్నూలు రోడ్డులో ఇన్‌చార్జ్ కమిషనర్ విజయలక్ష్మి సిబ్బందిచే కాలువలో పూడిక తీయించారు. తెలిపారు. బుధవారం ముళ్ల కంప తొలగించి, చెత్తాచెదారం తొలగింపు, పనులు చేయించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, సిబ్బంది ఉన్నారు.

బస్సు జాతాను జయప్రదం చేయాలి


పోస్టర్‌ను విడుదల చేస్తున్న నాయకులు

కర్నూలు అర్బన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న బస్సు జాతాను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. శరత్ కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం ఆర్‌యూలో పోస్టర్లు, కరపత్రాలను విడుదల చేశారు. గత వైసీపీ పాలనలో జగన్ వైద్యవిద్య సీట్లను అమ్మకానికి పెట్టారని, అప్పట్లో నారాలోకేష్ ఆరోపించారని, అధికారంలోకి రాగానే పీపీపీ ద్వారా ప్రైవేటికరణకు తెరలేపడం సమంజసం కాదన్నారు. నవంబరు 10న కర్నూలులో బహిరంగ సభ ఏర్పాటు చేశామన్నారు. అలీ, ఈశ్వర్, మధు, గణేష్, నబీరసూల్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు బ్యాండ్ ప్రదర్శన

- అమరవీరుల త్యాగాల సంస్మరణార్థం..

కర్నూలు క్రైం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్ కార్యాలయంలో అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ ఎస్పీ ఆదేశాల మేరకు బుధవారం పోలీసు బ్యాండ్‌ను ప్రదర్శించారు. దేశభక్తి గీతాలను, గేయాలు, పాటలు ఆలపిస్తూ పోలీసు అమరవీరుల త్యాగాలు, సేవలను కీర్తిప్రతిష్టలను ఆలపించారు. ఆర్ఐ జావేద్, ఆర్ఎస్ఐలు హుశేన్, మహేశ్వరరెడ్డి, సురేష్‌రెడ్డి, ఏఆర్ పోలీసు సిబ్బంది, సంగీత గాయకుడు హోంగార్డు శామ్యూల్, ప్రజలు పాల్గొన్నారు.


బ్యాండ్ షోలో పోలీసు

అబూబకర్ మృతి లోటు


నివాళి అర్పిస్తున్న గఫూర్

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆవాజ్ కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అబూబకర్ అకాల మరణం ఉద్యమానికి తీరనిలోటని ఆవాజ్ కమిటి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎంఏ.గఫూర్ అన్నారు. బుధవారం భౌతికకాయానికి నివాళి అర్పించారు. ప్రజా సమస్యలపై పోరాడుతూ, సమస్యల పరిష్కారమే ధ్యేయంగా జీవితాన్ని అంకితం చేశారన్నారు. ఎస్ఏ.సుభాన్, పి.ఇక్బాల్ హుస్సేన్, ఎస్ఎండీ.షరీఫ్, అబ్దుల్ దేశాయ్, అబ్దుల్‌నయీం, షాజర్ పాల్గొన్నారు.

నాలుగు గంటల్లోపు చికిత్స అందాలి



స్ట్రోక్ నుంచి కోలుకున్న రోగులతో వైద్యులు

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): స్ట్రోక్ వచ్చిన వ్యక్తికి నాలుగు గంటలోలపు చికిత్స అందిస్తే ప్రాణాన్ని కాపాడవచ్చని మెడికవర్ హాస్పిటల్ న్యూరాలజిస్టులు డా.ఎస్.నాగసురేష్, డా.వై.రఘునందిని అన్నారు. వరల్డ్ బ్రెయిన్ స్ట్రోక్ డేను పురస్కరించుకుని మెడికవర్ హాస్పిటల్‌లో బుధవారం స్ట్రోక్ నుంచి కోలుకున్న రోగులకు అవగాహన సదస్సు నిర్వహించారు. రోగులు తమకు తక్షణ సేవలు అందించిన వైద్యులను గుర్తు చేసుకున్నారు. న్యూరోసర్జన్ డా.విశ్వకుమార్ మాట్లాడుతూ స్ట్రోక్‌పై అవాహన పెరగాలని, స్ట్రోక్ అనేది మెదడుకు రక్తప్రసరణ ఆగిపోయినప్పుడు లేదా రక్తస్రావం జరిగినప్పుడు సంభవించే అత్యవసర పరిస్థితి అని హాస్పిటల్ క్లస్టర్ హెడ్ వై.మహేశ్వరరెడ్డి అన్నారు. స్ట్రోక్ వచ్చినప్పుడు ఒక్క నిమిషం ఆలస్యం కాకుండా హస్పిటల్‌లో చేర్చాలన్నారు.

టీడీపీ నాయకుడి మృతి

కోడుమూరు రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వర్కూరు న్యూ ఎస్సీ కాలనీకి చెందిన టీడీపీ నాయకుడు మాదిగ కుర్రన్న(78) గుండెపోటుతో మృతి చెందాడు. పార్టీనాయకులు అశోక్, రామాంజనేయులు, చిన్నగడ్డమయ్య, ఎల్.గిరి నివాళి అర్పించారు.

పొలం గట్లపై మీటరు లోతు గుంత తీయాలి


బొప్పాయి తోటను పరిశీలిస్తున్న ఉద్యానవన అధికారులు

సి. బెళగల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పండ్ల తోటలు సాగుచేసే రైతులు పొలం గట్లపై మీటరులోతు గుంత తీయాలని అనంతపురం జిల్లా ఉద్యానవన శాఖ అధికారులు సూచించారు. మండంలోని ఇనగండ్ల, సి బెళగల్, బ్రాహ్మణ దొడ్డి గ్రామాల్లో పండ్ల తోటలను పరిశీలిం చారు. బుధవారం రవిరెడ్డి, మదన్‌మొహన్, శ్రావణి బొప్పాయి, మునగ, బత్తాయి, దానిమ్మ, మామిడి, కొబ్బరితోటను పరిశీలించి సూచనలు చేశారు. పండ్ల తోటల సాగుకు ప్రభుత్వం 50 శాతం రాయితీ ఇస్తుంద న్నారు. అంతర పంటలు కూడా సాగుచేయవచ్చని, పొలంగట్లపై మీటరు లోతు గుంతను తీస్తే మొక్కలు దెబ్బతినవన్నారు. కోడుమూరు ఉద్యానవనశాఖ అధికారి మదన్‌మొహన్, హనీఫ్, ఏవోలు, రైతులు ఉన్నారు.

జాయింట్ కమిషనర్‌ను సస్పెండ్ చేయాలి


నిరసన తెలుపుతున్న వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగులు

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ రవీంద్రనాథ్‌రెడ్డిని సస్పెండ్ చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బంగి శ్రీధర్ డిమాండ్ చేశారు. బుధవారం అసోసియేషన్ కార్యాలయంలో మాట్లాడుతూ నాలుగో తరగతి ఉద్యోగిపై జాయింట్ కమిషనర్ చేసిన దాష్టికాన్ని సహించబోమని హెచ్చరించారు. ఉద్యోగులపై చేయిచేసు కోవడం, కులం పేరుతో దూషించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యదర్శి సురేష్‌రెడ్డి, మురళీకృష్ణనాయుడు, చెన్నకృష్ణ, ఉపాధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● కర్నూలు వాణిజ్య పన్నుల శాఖ కార్యా లయంలో భోజన విరామ సమయంలో ఉద్యోగులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. డివిజన్ అధ్యక్షుడు రఘురామిరెడ్డి, మధుసూధన్‌రెడ్డి, ప్రభాకర్, మహలక్ష్మి, శశికళ, గోపి పాల్గొన్నారు.

పంటల పరిశీలన

సి. బెళగల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో వర్షంతో దెబ్బతిన్న పంటలను వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్ బుధ వారం పరిశీలించారు. ఇనగండ్ల, గుండ్రేవుల, బెళగల్ గ్రామాల్లోని పత్తి, వరి, మొక్కజొన్న, సజ్జ, వెరుశనగను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. పత్తి పంటను కాపాడుకునేందుకు యూరియా, పొటాషియం నైట్రేట్ కలిపి పిచికారీ చేయాలన్నారు.


పత్తి పంటను పరిశీలిస్తున్న ఏవో

మిశ్రమ పంటల సాగుతో అధిక లాభం

కోడుమూరు రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మిశ్రమ పంటలు సాగు చేస్తే రైతులు అధిక లాభాలు పొందవచ్చని జిల్లా శిక్షణ కేంద్రం ఏడీఏ వెంకటేశ్వర్లు సూచించారు. బుధవారం ప్యాలకుర్తిలో పంటలను పరిశీలించి రైతులకు సూచనలు ఇచ్చారు. తుఫాన్ వచ్చినా మిశ్రమపంటల సాగుతో నష్టం ఉండదన్నారు. కందిలో పూత రాలకుండా మల్టీకే, గూడుపురుగు నివారణకు డెల్టామెత్రిన్ ఎకరాకు 100 మి.లీ.ల చొప్పున పిచికారీ చేయాలని సూచించారు. శనగలో తేమశాతం పెరిగి ఎండుతెగులు వచ్చే ప్రమాదం ఉందని, నివారణకు బైటాక్‌ను, వేరుశనగలో పచ్చ, లద్దెపురుగు నివారణకు నువాలురాన్, ఇండికాటార్ప్ కలిపి పిచికారీ చేయాలన్నారు. ఎకరాకు 200 కి.గ్రా జిప్సం వేయడం మూలంగా అధికవేర్లు వచ్చి దిగుబడి పెరుగుతుందన్నారు. వ్యవసాయాధికారులు రవిప్రకాష్‌గౌడ్, వెంకటరంగారెడ్డి పాల్గొన్నారు.


వేరుశనగ పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

వైసీపీని మట్టి కరిపించాలి

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి : ఏపీ సీడ్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి

ఆలూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీని మట్టి కరిపించాలని ఏపీ సీడ్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. బుధవారం ఆలూరులో అంబేడ్కర్, వాల్మీకి విగ్రహాలకు పూలమాలలు వేసి కార్యకర్తలతో కలిసి ర్యాలీగా వాసవీ కళ్యాణ మండపంకు చేరుకుని మండల కమిటీల ఎంపికపై నియోజకవర్గ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి మరింతగా దృష్టి సారించి నూతన కమిటీలను ఎంపిక చేస్తామన్నారు. ఇందుకోసం గ్రామాల వారీగా సమావేశాలు నిర్వహించి గ్రామ కమిటీలు, మండల కమిటీలను ఎంపిక చేసే ప్రక్రియ తొందరగా పూర్తి చేయాలన్నారు. అనంతరం ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి మాట్లాడుతూ పార్టీ పటిష్టత కోసం కార్యకర్తలు, నాయకులు సమిష్టిగా పని చేయాలన్నారు. పార్టీ కోసం పనిచేసే వారికి అనేక రకమైన పదవులు ఉన్నాయన్నారు. గ్రామాల్లో కూడా అనేక పోస్టులు ఉన్నాయని, ఎవరూ నిరుత్సాహ పడకుండా సైనికుల్లా పని చేయాలన్నారు. అనంతరం టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్ మాట్లాడుతూ నియోజకవర్గంలో వైసీపీ చెంచాలను తరిమి కొడతామన్నారు. గ్రామాల్లో పార్టీ నాయకుల మధ్య మనస్పర్థలు రాకుండా కలిసికట్టుగా పని చేయాలన్నారు. పార్టీ క్యాడర్‌కు తాము అండగా ఉంటామన్నారు. ఏ సమస్య వచ్చినా ఫోన్ చేస్తే గంటలోగా మీ గ్రామానికి వస్తామని, ఎవరూ అధైర్య పడకుండా పార్టీని, మన నాయకుడు చంద్రబాబును నమ్ముకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ వెంకటేష్, వైస్ చైర్మన్ రంగడు, మాజీ ఎంపీపీ రామచంద్రనాయుడు, ఏటీసీ డీసీ అధ్యక్షులు నగరడోన కిష్టప్ప, మండల కన్వీనర్లు అశోక్, సుధాకర్, విజయ్‌కుమార్‌గౌడ్, వల్లి, దేవరగట్టు చైర్మన్ వీర నాగప్ప, నాయకులు శేషగిరి, విష్ణువర్ధన్‌రెడ్డి, తిమ్మయ్య, కటారికొండ శ్రీనివాసులు, ।ధర్, గోవిందు, పురుషోత్తం, అంపయ్య, బసప్ప, కృష్ణంనాయుడు, సాలిసాహెబ్, ప్రకాష్, ఈరన్న, కృష్ణయాదవ్, జీవన్‌కుమార్, నరసప్ప, వెంకన్న, కొమ్ము రామాంజినేయలు, రాజు, జగన్, ఉచ్చీరప్ప, మల్లికార్జున, రంగన్న, నారాయణ, మోహన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ధర్మవరం సుబ్బారెడ్డి, పాల్గొన్న వైకుంఠం జ్యోతి, వైకుంఠం శివప్రసాద్

మార్కెట్‌యార్డు అభివృద్ధికి కృషి చేయాలి

● ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి

చిప్పగిరి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మార్కెట్‌యార్డు అభివృద్ధికి కృషి చేసి క్రియ, విక్రయాలు జరిగేలా చూడాలని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి సూచించారు. మార్కెట్‌యార్డు గౌరవాధ్యక్షులుగా నియమితులైన ఎమ్మెల్యే విరుపాక్షిని యార్డు కార్యదర్శి సునీత మర్యాదపూర్వకంగా కలిసి ప్రభుత్వ ఉత్తర్వు కాపీని అందజేశారు. రైతులకు ఉపయోగపడేలా కూల్ స్టోరేజీని నిర్మించాలన్నారు. ప్రతివారం జరిగే పశువుల సంతలో రైతులకు, పశువులకు సౌకర్యాలు కల్పించాలని కోరారు. రైతులకు ఇబ్బంది లేకుండా సీసీఐ ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలన్నారు.

పంచాయితీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి

హొళగుంద, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మార్లమాడికి గ్రామ పంచాయితీ పరిధిలో అభివృద్ధి పనులు చేయకుండానే పంచాయతీ కార్యదర్శి లక్షల రూపాయలు ఖర్చు చేసినట్లు రికార్డులో చూపించి పంచాయితీ నిధులు స్వాహా చేసి అవినీతికి పాల్పడినట్లు ఏపీ దళిత సమాఖ్య మండల అధ్యక్షుడు నల్ల మల్లేశప్ప, సీపీఎం మండల కార్యదర్శి వెంకటేష్, రైతు సంఘం నాయకుడు రవికుమార్ సీఐటీయూ మండల కార్యదర్శి నాగరాజు బుధవారం ఆరోపించారు. విషయంపై ఎంపీడీవో విజయలలితను వివరణ కోరగా మార్లమాడికి పంచాయితీకి సంబంధించిన నిధుల దుర్వినియోగం పై విచారణ చేపట్టి సంబంధిత వ్యక్తుల పై చర్యలు తీసుకుంటామన్నారు.

మంచినీరు అందిస్తాం

మద్దికెర, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దికెర గ్రామ శివారులో ఉన్న నీటి పథకం చెరువు నుంచి గ్రామస్థులకు మంచినీరు అందిస్తామని ఎంపీడీవో శివకుమార్ తెలిపారు.

కంబాలపాడు కొండ ప్రాంతంలో పరిశీలన



పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్

క్రిష్ణగిరి, అక్టోబరు 29, (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంబాలపాడు, పెనుమాడ, చుంచు ఎర్రగుడి, చిట్యాల ప్రాంతాల మధ్య విస్తరించిన కంబాలపాడు (దనలయ్య కొండ)ను జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్, ఆర్డీవో భరత్ నాయక్ బుధవారం పరిశీలించారు. నాలుగు గ్రామాల పరిధిలో దాదాపు 1200 ఎకరాలలో విస్తరించిన దనలయ్యకొండ ప్రాంతం పరిశ్రమల ఏర్పాటుకు అనుగునంగా ఉందా, ఈ కొండ ప్రాంతాన్ని ప్రజలకు ఉపయోగపడేలా ఏవిధంగా మార్చాలి అన్న అంశాల ఆధారంగా కొండప్రాంతాన్ని పరిశీలిస్తూ రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఉన్నతాధికారులకు నివేదికను అందిస్తామని తెలిపారు. ఇన్‌చార్జ్ తహశీల్దార్ రాజేశ్, వీఆర్వోలు ప్రహ్లద్, నారాయణ, గిడ్డయ్య, సర్వేయర్ మాధవకృష్ణ పాల్గొన్నారు.

పెరిగిన పంచాయతీ ఆదాయం

దేవనకొండ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుంకనూరు కూరగాయాల మార్కెట్ వేలంలో గతంలో కంటే అధికంగా రూ.6.50 లక్షల ఆదాయం పెరిగింది. గ్రామంలో ఆంజనేయస్వామి దేవాలయం ఆవరణంలో డిప్యూటీ ఎంపీడీవో గోపాల్, సర్పంచు ఈరమ్మ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన మార్కెట్ వేలం పాటలో కుంకనూరు గ్రామానికి చెందిన రమేష్ రూ. 14.70 లక్షలకు మార్కెట్ దక్కించుకున్నాడు. గత ఏడాది రూ.8.20 లక్షలకు అమ్ముడు పోగా, ఈ ఏడాది గతంలో కంటే అధికంగా రూ.6.50 లక్షలు పలికింది.

ఈ సమయంలో పంట కోత వద్దు

ఆదోని అగ్రికల్చర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : తుపాను ప్రభావం వల్ల వర్షాలు కురుస్తున్న సమయంలో పొలంలో పంట కోత చేపట్టొద్దని మండల వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్ కోరారు. బుధవారం మండలంలోని సంతే కూడ్లూరు, పెద్ద హరివాణం గ్రామ పొలాలలో రైతులకు హార్వెస్టింగ్ పై అవగాహన కల్పించారు. ఆయన వెంట వ్యవసాయ విస్తరణ అధికారులు సతీస్, అయ్యన్న ఉన్నారు.

పప్పుశనగ రైతులను ఆదుకోండి

ఆస్పరి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గత మూడు రోజుల నుంచి మొంథా తుఫాన్ వల్ల నష్టపోయిన పప్పుశనగ రైతులను ఆదుకోవాలని రైతు సంఘం మండల కార్యదర్శి రంగస్వామి, మధుసూదన్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రమైన ఆస్పరిలో గ్రామంలో వర్షం వల్ల దెబ్బతిన్న వేరుశనగ పంటలను పరిశీలించారు. ఆస్పరి, జొహరాపురం, చిన్నహోతూరు, చిరుమాన్‌దొడ్డి, శంకరబండ రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం



చెక్కులను అందజేస్తున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

కర్నూలు అర్బన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి బాధితులకు వరమని ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. బుధవారం కార్యాలయంలో ఆలూరు మండలం హొలేబీడుకు చెందిన గొల్ల నాగన్నరే రూ.50,431 చెక్‌ను అందజేశారు. బధితుడు ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొంది, వైద్య ఖర్చుల కోసం విన్నవించగా సీఎం కార్యాలయానికి సిఫారసు చేశామన్నారు.

ఆదోని: ఆదోని టీడీపీ సీనియర్ నేత, మాజీ పట్టణ అధ్యక్షుడు వాల్మీకి గుంటెప్పను మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు ఆదేశాల మేరకు వారి తనయులు, టీడీపీ యువ నాయకులు భూపాల్‌చౌదరి, మారుతి నాయుడు, వెంకటేష్‌చౌదరి పరామర్శించారు. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధ పడుతున్న గుంటెప్పకు వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ.2.60 లక్షల చెక్కును భూపల్‌చౌదరి, మారుతినాయుడు అందజేశారు. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్‌చౌదరి, వాల్మీకి వెంకటేష్, జయరాం, కాసన్న, గోపాల్, హనుమంతు, బసవరాజు పాల్గొన్నారు.

సొంత ఖర్చులతో రోడ్డు పనులు

ఆదోని టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 35వ వార్డు అమరావతి నగర్ లో స్థానికుల వినతి మేరకు వార్డు కౌన్సిలర్ వెల్లాల లలితమ్మ సొంత ఖర్చుతో రహదారిని బాగుచేయించారు. రహదారికి ఇరువైపులా ముళ్ళచెట్లు పెరిగి ప్రమాదాలు జరుగుతున్నాయని, డ్రైనేజీ లేని కారణంగా వర్షాకాలంలో రోడ్లపైకి వరదనీరు చేరి రాకపోకలకు కలుగుతున్న ఇబ్బందులను కాలనీకు చెందిన యువకులు కౌన్సిలర్ వెల్లాల లలితమ్మ దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఆమె వెంటనే స్వంత ఖర్చులతో రోడ్డును బాగుచేయించి ఇరువైపులా తాత్కాలిక డ్రైనేజీని ఏర్పాటు చేయించారు. వార్డుకు చెందిన యువకులు వడ్డే అశోక్, వాల్మీకి వినోద్, శశిధర్, అమరేష్, ధనుష్, శకుంతల, ఆదిలక్ష్మి బీజేపీ నాయకులు వెల్లాల మధుసూదన్ శర్మ, నూర్జహాన్, పరశురాం పాల్గొన్నారు.

టెట్‌పై రివ్యూ పిటీషన్ వేయడం హర్షణీయం

పత్తికొండ టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): టెట్‌పై రివ్యూ పిటీషన్ వేయడం హర్షణీయమని ఎస్టీయూ రాష్ట్ర నాయకులు సత్యనారాయణ, కె.నారాయణ, జిల్లా ఆర్థిక కార్యదర్శి రామ్మోహన్‌రెడ్డిలు పేర్కొన్నారు. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు టెట్‌లో తప్పనిసరిగా అర్హత సాధించాలన్న అంశంపై సుప్రీంకోర్టులో కూటమి ప్రభుత్వం రివ్యూ పిటీషన్ వేసేందుకు నిర్ణయం తీసుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఎస్టీయూ నాయకులు బలరాం, మారుతి, భీరప్ప, వెంకటరాముడు, నాగార్జున, కామేష్ పాల్గొన్నారు.

ఆదోని అగ్రికల్చర్ : 2011 ముందు ఉపాధ్యాయ ఉద్యోగంలో చేరిన ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ మహాదేవప్ప కోరారు. ఉపాధ్యాయ వృత్తిలో చేరి దాదాపు 25 ఏళ్లు దాటిపోయిన టెట్ రాయాల్సిన ఆవశ్యకత ఏమిటని ప్రశ్నించారు. విద్యాహక్కు చట్టం 2009ని సవరణ చేయాలని కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి సుంకన్న, అబ్దుల్ నబి, రామ్మోహన్ రెడ్డి, షేక్షా వలి, ఆంజనేయ, భాస్కర్, వెంకటేశ్వర్లు, శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

పంచాయతీ అభ్యున్నతికి కలిసి పని చేద్దాం

పత్తికొండ టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ మేజర్ గ్రామ పంచాయతీ అభ్యున్నతికి కలిసి సమిష్టిగా పని చేద్దామని ఈవో నరసింహులు పాలకమండలి సభ్యులకు సూచించారు. బుధవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కొమ్ముదీపిక అధ్యక్షతన పాలకమండలి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పత్తికొండ గ్రామ పంచాయతీ మేజర్ పంచాయతీ అని, ఈ పంచాయతీలో పట్టణవాసులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎప్పటికప్పుడు సమన్వయంతో సమస్యలను పరిష్కరిస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. వార్డు మెంబర్లు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీవో, పాలవ్యాన్ డ్రైవర్ మధ్య వాగ్వాదం

పత్తికొండ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ బైపాస్ హోసూరు రోడ్డు వద్ద బుదవారం సాయింత్రం అర్టీవో ఒపాలవ్యాన్ డ్రైవర్ మధ్య వాగ్వివాదం చోటుచెసుకుంది. వివరాలివీ.. అనంతపురం పాలప్యాకెట్ల లోడుతో వెల్తున్న ఐసర్ పాలవ్యాన్‌ను తనికి నిమిత్తం ఆదోని ఆర్టీవో ఎండి అవెన్ నిలిపి రికార్డులు చూపించమనడంతో డ్రైవర్ సరైన సమాధానం ఇవ్వకపోగ దురుసుగా ప్రవర్తించడంతో వాగ్వాదం జరిగినట్లు సమాచారం. దీంతో బైపాస్ రోడ్డుపై వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్ స్తంభించింది, విషయం తెలుసుకున్న పత్తికొండ పోలీసులు ఆర్టీవోతోపాటు పాలవ్యాన్‌డ్రైవర్‌ను పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లి ట్రాఫిక్ క్లియర్ చేశారు.

వలసలు నివారించాలి

దేవనకొండ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వలసలు నివారించి మూడు నెలల పెండింగ్ వేతనాలు ఇవ్వాలని సీసీఎం జిల్లా నాయకులు వీరశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధి పనులు లేకపోవడంతో గుంటూరు, తెలంగాణకు వలస బాట పడుతున్నారన్నారు. ఆదుకొవాల్సిన ప్రభుత్వాల నిర్లక్ష్యంతో ఉన్న ఊరుని వదిలేసి, సూదూర ప్రాంతాలకు బతుకు కోసం వలసపోతున్నారని తెలిపారు. ప్రభుత్వాలు నిర్లక్ష్యం వీడి రైతులను, కూలీలను ఆదుకొని వ్యవసాయాని ఉపాధికి అనుసంధానం చేయాలన్నారు. స్థానిక గ్రామపంచాయతి కార్యాలయం కార్యదర్శి రఫీకి వినతిపత్రం ఇచ్చారు.

సీసీఐ ద్వారా పత్తి విక్రయించుకోవాలి

● మార్కెటింగ్ శాఖ డీడీ లావణ్య



పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్కెటింగ్ శాఖ డీడీ లావణ్య, మార్కెట్ యార్డు చైర్మన్ మల్లయ్య

ఎమ్మిగనూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పత్తి రైతులు సీసీఐ ద్వారా తాము పండించిన పత్తిని అమ్ముకోవాలని మార్కెటింగ్ శాఖ డీడీ లావణ్య అన్నారు. బుధవారం పట్టణ శివారులోని మంత్రాలయం రోడ్డులో శివ జిన్నింగ్ మిల్లులో ఏర్పాటు చేసిన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ యార్డు చైర్మన్ మల్లయ్యతో కలిసి డీడీ లావణ్య ప్రారంభించారు. డీడీ మాట్లాడుతూ పత్తిని సీసీఐకి విక్రయించాలనుకుంటున్న రైతులు కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుక్ చేసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం పత్తికి రూ. 8110 కనీస మద్దతు ధర అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏం సత్యనారాయణ మూర్తి, సీసీఐ అధికారి శివరాం, మహాబలేశ్వర్ పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి: డీఎస్పీ



మాట్లాడుతున్న డీఎస్పీ భార్గవి

ఎమ్మిగనూరు టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పోలీసులు, వారి కుటుంబ సభ్యులు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని డీఎస్పీ భార్గవి సూచించారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని బాబు ఫంక్షన్ హాలులో సీఐ శ్రీనివాసులు అధ్వర్యంలో సబ్ డివిజన్ పరిధిలోని పోలీసులకు, వారి కుటుంబ సభ్యులకు మెడికల్ క్యాంపు నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ పోలీసు అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో భాగంగా వారు వారి కుటుంబాలకు దూరంగా ఉంటూ పని ఒత్తిడికి లోనయ్యి తమ, తమ కుటుంబాల ఆరోగ్యాల పట్ల శ్రద్ధ చూపలేకపోతున్నారు. ఈ మెడికల్ క్యాంపులో బ్లడ్ టెస్ట్, ఈసీజీ, కార్డియాలజీ, కంటి పరీక్ష, జనరల్ చెకప్‌లు ఏర్పాటు చేశారు. ఇందులో దాదాపు 300 మంది వరకు పరీక్షలు చేయించుకున్నట్లు తెలిపారు. మెడికల్ క్యాంపునకు సహకరించిన డాక్టర్ హేమంత్, మనోజ్, మహేష్, బీరప్ప, తోగట నరసింహులను ఘనంగా సన్మానించారు. పోలీసుల వారి కుటుంబాలకు భోజన వసతి కూడా ఏర్పాటు చేశారు. సీఐలు చిరంజీవి, మంజునాథ్, విజయభాస్కర్, రామాంజులు, ఆశోక్‌కుమార్, ఎస్ఐలు మధుసూదన్‌రెడ్డి, వి శ్రీనివాసులు, శ్రీనివాసులు, శివాంజల్, మల్లికార్జున, తిమ్మారెడ్డి, శరత్, నిరంజన్ రెడ్డి, హనుమంతురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల మరమ్మతులకు రూ.కోటి



హెచ్. కైరవాడిలోని కులుమాల రోడ్డులో నిలిచిన నీరు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గోనెగండ్ల, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): హెచ్.కైరవాడి నుంచి కులుమాల కు వెళ్లే ప్రధాన రహదారి గుంతలు పడి వర్షం నీరు చేరి ఉండటం వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఉండటాన్ని గమనించిన కలెక్టర్ ఎ. సిరి రహదారి మరమ్మతులకు రూ. కోటి విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. బుధవారం ఆంధ్రజ్యోతి దిన పత్రికలో 'జలమయమైన రహదారులు' అన్న శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఇందుకు కలెక్టర్ ఎ.సిరి స్పందించి నిధులు విడుదల చేశారు. బుధవారం జిల్లా కలెక్టర్ ఏ. సిరి. హెచ్ కైరవాడి మీదుగా కులుమాల గ్రామానికి వెళ్లారు. అదే రహదారిలో గుంతలు పడి వర్షం నీరు నిండి ఉండి వాహనాల రాకపోకలకు ఇబ్బందిని కలెక్టర్ ప్రత్యక్షంగా గమనించారు. ఈ దారి కులుమాల, పెద్దనేలటూరు గ్రామాలకు వెళ్తుంది. దీంతో హెచ్ కైరవాడి, కులుమాల గ్రామాలకు వెళ్లే రహదారి మరమ్మతులకు ఎస్టిమేషన్ వేయించి ఆర్అండ్‌బీ అధికారులతో మాట్లాడి రూ. 1కోటి విడుదల చేస్తామని కలెక్టర్ సిరి తెలిపారు. దీంతో హెచ్ కైరవాడి, కులుమాల గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు.

గుంతల పూడ్చివేత



పనులను పరిశీలిస్తున్న అధికారులు, టీడీపీ నాయకులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కోసిగి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కోసిగిలోని మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు ప్రధాన ఆర్అండ్‌బీ రోడ్డు గుంతలు పడి అధ్వానంగా తయారైంది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వరకు ప్రధాన రోడ్డు అధ్వాన్నంగా తయార కావడంతో మంగళవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో గుంతల రోడ్లు.. వాహనదారుల అవస్థలు అనే కథనానికి మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి ఆదేశాల మేరకు ఎంపీడీవో ఈశ్వరయ్య స్వామి టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ముత్తురెడ్డి, ఆర్లబండ సహకార సంఘం చైర్మన్ నాడిగేని అయ్యన్న గుంతల రోడ్లుపై సిమెంటుతో కలిసిన 40 ఎంఎం కంకర రాళ్లతో గుంతలను పూడ్చడంతో ఆంధ్రజ్యోతి కథనంతో గుంతల రోడ్డుకు మోక్షం కలిగింది. దీంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. వర్షం పడిన సమయంలో గుంతల్లో వర్షం నీరు నిల్వ చేరి ప్రమాదకరంగా తయారైంది. గుంతలు పూడ్చడంతో వాహనదారులు సురక్షితంగా ప్రయాణం చేస్తున్నారు.

మున్సిపల్ కౌన్సిల్ మీట్ రసాభాస

● వైసీపీ, టీడీపీ సభ్యుల వాగ్వాదం
● అర్ధాంతరంగా ముగిసిన సమావేశం



వాగ్వాదానికి దిగిన టీడీపీ, వైసీపీ కౌన్సిలర్లు

ఎమ్మిగనూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం టీడీపీ, వైసీపీ సభ్యుల మధ్య వాగ్వాదంతో గందరగోళంగా మారింది. ఎవరు ఏమి మాట్లాడుతున్నారో.. ఎందుకు వాగ్వాదం చేసుకుంటున్నారో.. తెలియక సమావేశాన్ని మున్సిపల్ చైర్మన్ రఘు అర్ధాంతరంగా ముగించారు. మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం బుధవారం చైర్మన్ రఘు అధ్యక్షతన నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్ మాట్లాడుతూ సమావేశాల్లో అభివృద్ధి పనులకు సంబంధించి తీర్మాణాలు చేస్తున్నామని, అయితే అవి టెండర్ దశకు రాకపోగా పనులు జరగటం లేదన్నారు. కాంట్రాక్టర్లకు రూ. 5 కోట్లకు పైగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని చైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. అలాగే మున్సిపల్ న్యాయ సలహాదారుడిగా న్యాయవాది గురురాజును ఏకగ్రీవంగా ఆమోదిస్తున్నామని వైసీపీకి చెందిన కౌన్సిలర్ల సంతకాలతో కూడిన తీర్మాణాన్ని చైర్మన్‌కు అందజేశారు. అనంతరం కూటమి పార్టీలకు చెందిన సభ్యులు అమాన్, ఇసాక్, వాహీద్‌తో పాటు దయాసాగర్ వైస్‌చైర్మన్ ఆరోపణలను అడ్డుకున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాతే అభివృద్ధి జరిగిందన్నారు. బిల్లులు రావాల్సింది వాస్తవమేనని, అవి త్వరలో విడుదులవుతాయన్నారు. వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధి పనులకు టెంకాయలు కొట్టి పనులు జరగలేదని ఆరోపించారు. దీంతో వైస్ చైర్మన్ న జీర్ కలుగజేసుకోవడంతో వీరి మధ్య వాగ్వాదం జరిగింది. చైర్మన్ రఘు కలుగచేసుకొని ఇరువురిని శాంతింపజేశారు. ఒకటో వార్డు కౌన్సిలర్ నాగేశప్ప మాట్లాడుతూ జోగి కాలనీలో 13 నెలల క్రితం పనులకు భూమి పూజ చేశారని, ఇప్పటి వరకు పనులు ప్రారంభం కాలేదని, అలాగే ఒకటో వార్డులో కూడా ఇదే పరిస్థితి ఉందని చెప్పారు. 28వ వార్డు కౌన్సిలర్ బజారి మట్లాడుతూ తమ వార్డులో తాగునీటి సమస్యపై పూర్తి స్థాయి వివరాలు అందజేసినా పట్టించుకోవటం లేదన్నారు. కౌన్సిలర్ చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ తమ వార్డులో కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రోడ్లు, డ్రైనేజీల పనులు జరిగాయన్నారు. అభివృద్ధి జరుగుతోందన్నారు. కూటమి ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని, అభివృద్ధి జరుగుతోందని అన్నారు. ఇందుకు కౌన్సిలర్ బజారి ప్రభుత్వం చేస్తున్న పథకాలు ఏంటో అందరికీ తెలుసునని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదని, మీ వార్డులో సమస్యలు చెప్పాలని అడ్డుతగిలారు. దీంతో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య మరోసారి వాగ్వాదం చోటు చేసుకుంది. అనంతరం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రూ. 5.60 కోట్లతో పనులు పూర్తి అయ్యాయని, 15వ ఆర్థికం సంఘం నిధులతో కూడా పనులు చేపడుతున్నామని తెలిపారు. తిరుమల నగర్‌లో కూడా రూ.38 లక్షలతో సీసీ రోడ్డు, డ్రైన్‌ల పనులు ప్రారంభించామని, వచ్చేనెలలో పూర్తి చేస్తామని చెప్పారు. వెంకటాపురం కాలనీలో కూడా రూ. 50 లక్షలో అభివృద్ధి పనలు చేపట్టామని చెప్పుకొస్తుండగా ఆ వార్డు కౌన్సిలర్ బజారి అభ్యంతరం తెలిపారు. రెండేళ్లుగా తాగునీటి సమస్య ఉందని చెబుతున్నా.. ఏమాత్రం పట్టించుకోవటం లేదని కమిషనర్‌పై మండిపడ్డారు. అనంతరం 22వ వార్డు కౌన్సిలర్ దయాసాగర్ మాట్లాడుతూ చైర్మన్ వార్డులో కూడా నీరు నిలిచాయని చెప్పుకొస్తుండగా.. చైర్మన్ స్పందిస్తూ.. మీ వార్డు గురించి మాట్లాడండి.. ఇతర వార్డుల గురించి ఎందుకు మాట్లాడుతున్నారు?, మీరేమైన ఫ్లోర్ లీడరా? అని మాట్లాడడంతో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. దయాసాగర్‌కు మద్దతుగా టీడీపీ సభ్యులు, చైర్మన్‌కు మద్దతుగా వైసీపీ సభ్యులు గొంతు కలిపారు. దీంతో సమావేశంలో గందరగోళం ఏర్పడటంతో చైర్మన్ బెల్ కొట్టి అర్ధాంతరంగా సమావేశాన్ని ముగించి వెళ్లిపోయారు. సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ దివ్యకళ, డీఈ నీరజ, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సాగునీటి సమస్యను పరిష్కరించాలి

కౌతాళం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని మేలిగనూరు వద్ద ఉన్న తుంగభద్ర నదిపై వరద కాలువను నిర్మించి ఆంధ్ర పశ్చిమ ప్రాంత రైతులకు సాగు, తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఏపీ రైతు సంఘం మండల కన్వీనర్ ఈరన్న, సీనియర్ నాయకుడు మల్లయ్య అన్నారు. కౌతాళంలోని సీపీఎం కార్యాలయం నందు బుధవారం విలేకరు సమావేశంలో మాట్లాడుతూ మండలంలోని మేలిగనూరు వద్ద కర్ణాటక ప్రభుత్వం తుంగభద్ర నదిపై వరద కాలువ, లేదా బ్రిడ్జి కమ్ బ్యారేజ్‌ను నిర్మిస్తే కుడికాలువన ఏర్పాటు చేసి కౌతాళం మండలానికి సాగునీరు అందిస్తే మండలంలో వలసలను నివారించవచ్చని తెలిపారు. ఆంధ్ర రైతులకు మేలు జరిగేలా ఏపీ అధికారులు చర్చలు జరిపి వరద కాలువ నిర్మించాలని డిమాండ్ చేశారు. ఇక్కడ వరద కాలువను నిర్మించడం వల్ల వర్షకాలంలో దాదాపు 100టీఎంసీలకు పైగా నీరు వృధాగా సముద్రంలోకి వెళ్తోందని, అందుకోసం నదిపై వరదకాలువను నిర్మిస్తే పశ్చిమ ప్రాంతాలైన మంత్రాలయం, ఎమ్మిగనూరు, ఆదోని, కోడుమూరు, కర్నూలు నియోజకవర్గ రైతులకు సాగు, తాగునీరు పుష్కలంగా అంది రైతులు వలసలుపోకుండా వలసలను నివారించవచ్చని తెలిపారు. ప్రతి ఏడాది మంత్రాలయం నియోజకవర్గం నుంచి వలసలు అధికంగా ఉంటాయని నియోజవర్గంలోనే తుంగభద్రనది ఉన్నా అధికారులు, ప్రభుత్వం మాత్రం నదిపై వరద కాలువ నిర్మాణం గురించి పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అనంతరం తుంగభద్ర నదిపై రెండు బ్యారేజిలను నిర్మించి మండలానికి సాగునీరు అందేలా చూడాలని మండలంలో సాగునీరు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అందుకోసం నవంబరు 1న కౌతాళంలో రైతు సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య, మండల కార్యదర్శి ఈరన్న, రైతు సంఘం నాయకులు హనుమంతు, రామాంజనేయులు ఉన్నారు.

ప్రైవేటీకరణ సరికాదు: వైసీపీ

నందవరం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలన్ని మోశారని, ప్రభుత్వ ఆస్తులను ప్రైటుకు అప్పగించడం సరికాదని వైసీపీ నాయకులు విరుపాక్షిరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి అన్నారు. మండలంలోని పెద్దకొత్తిలి, చిన్నకొత్తిలి, జోహరాపురం, గంగవరం గ్రామాల్లో బుధవారం పార్టీ మండల అధ్యక్షుడు శివారెడ్డిగౌడు కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్తులను ప్రవేటు వ్యక్తులకు అప్పగించే దిశగా ధనార్జనే ధ్యేయంగా ముదుకెళ్తున్నారన్నారు. కార్యక్ర మంలో జగన్మోహన్‌రెడ్డి, మురహరిరెడ్డి, రామకోటీరెడ్డి, విరుపాక్షిరెడ్డి, వెంకటేశ్వరం రెడ్డి, పల్లే రఘు, శంకరరెడ్డి, సూర్యప్రకాష రెడ్డి, శివన్న చాంద్, నజీర్, రమేశప్ప, ఎల్లాగౌడు, నరసింహారెడ్డి, సోమన్న, హనుమంతు పాల్గొల్గొన్నారు.

స్వర్ణ రథంపై ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు స్వర్ణ రథంపై విహరించారు. బుధవారం కార్తీమాసం శుద్ధ సప్తమి శుభదినాన్ని పురస్కరించుకుని శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూర్ణబోధ పూజ మందిరంలో మూలరాములు, జయరాములు, దిగ్విజయరాములకు బంగారు నాణేలతో అభిషేకం చేశారు. ఇది భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళ వాయిద్యాల మధ్య స్వర్ణ రథం పై ప్రహ్లాదరాయలను అధిష్ఠించి ఆలయ ప్రాంగాణం చుట్టూ ఊరేగించారు. అనంతరం ఊంజలసేవ నిర్వహించారు. భక్తులు గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్రస్వామికి విశేష పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మఠం పీఠాధిపతి భక్తులకు ఫల, పుష్ప, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు.

రాఘవరాయలకు స్వర్ణ కవచ సమర్పణ సేవ

వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళవాయిద్యాల మధ్య రాఘవ్రేంద స్వామి మూల బృందావనానికి బంగారు కవచ సమర్పణ సేవ రమణీయంగా చేశారు. బుధవారం కార్తీక సప్తమి శుభదినాన్ని పురస్కరించుకొని మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆధ్వర్యంలో మఠం పండితులు బృందావనానికి సుప్రభాతం, నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం, తులసి అర్చన, విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. బంగారు, వెండి, పట్టు వస్త్రాలు, బెంగళూరు నుంచి తెచ్చిన ప్రత్యేక పుష్పాలు, బంగారు కవచంతో చూడ ముచ్చటగా అలంకరించారు. ఇది భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. పీఠాధిపతి హాస్తోదకం చేసి మహా మంగళ హారతులు ఇచ్చారు.



స్వర్ణ రథంపై విహరిస్తున్న ప్రహ్లాదరాయలు

పాడి పరిశ్రమ ఏర్పాటు చేసుకోవాలి: కలెక్టర్



రైతులకు వేరుశనగ విత్తనాలను అందజేస్తున్న కలెక్టర్, జేడీఏ

గోనెగండ్ల, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): రైతులు పంటలతో పాటు పాడి పరిశ్రమను కూడా ఏర్పాటు చేసుకుంటే రైతులకు చేదోడుగా ఉంటుందని కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి అన్నారు. బుధవారం కులుమాల గ్రామంలో ఆమె పర్యటించారు. గ్రామంలో వ్యవసాయశాఖ అధికారులు ఆధ్వర్యంలో జాతీయ ఆహార నూనె గింజల పథకం పట్ల రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కలెక్టర్ సిరి ముఖ్య అతిధిగా వచ్చారు. రైతులకు నూతనంగా ఉత్పత్తి చేసిన టీసీజీఎస్ 1694 రకం వేశనగ విత్తనాలను మండలంలో 100 హెక్టార్లకు రూ. 7.10 లక్ష విలువైన 150 క్వింటాళ్ల విత్తనాలను రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా ఏడాదికి మూడు రకాల పంటలను సాగు చేసుకోవాలని కోరారు. అలాగే ప్రతి రైతు పాడి పరిశ్రమ ను ప్రోత్సహించాలన్నారు. ఆవు, గేదే. మేక తదితర పాడి పశువులన పెంచుకోవాలని దీని ద్వార రైతు కుటుంబాలకు ఆర్థికంగా ఎంతో ఆసరగా ఉంటుందన్నారు. అధికారులు 157 రకాల నూనె జాతి మొక్కలను ఉచితంగా రైతులకు అందజేస్తున్నారని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులు ఉల్లి పంటపైనే కాకుండా ఇతర పంటల ను కూడా సాగు చేసుకోవాలని ఈ ఏడాది ఉల్లి ధరలు రైతులకు ఆశాజనకంగా లేవని కావున ఇతర పంటలను కూడా సాగు చేసుకుంటే రైతులకు ఇబ్బందులు ఉండవని కలెక్టర్ రైతులకు సూచించారు. పంటలు యాజమాన్య పద్ధతుల గురించి, పత్తి మద్దతు ధర కు అమ్ముకునే రైతులు తప్పని సరిగా రైతు సేవా కేంద్రాలలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కపాస్ కిసాన్ యాప్ నందు స్లాట్ బుక్ చేసుకోవాలని జేడీ వరలక్ష్మి వివరించారు. వెటర్నరీ జేడీ శ్రీనివాసులు పశుసంపదపై, వాటి ద్వారా రైతులకు వచ్చేరాబడి గురించి వివరించారు. ఇన్‌చార్జి ఆర్డీవో అజయ్, జేడీఏ వరలక్ష్మి, పశుసంవర్ధన శాఖ అధికారి శ్రీనివాసులు, కృషి విజ్ఞాన్ కేంద్రం కోఆర్డినేటర్ రాఘవేంద్ర, ఇరిగేషన్ ఈఈ పాండురంగయ్య, తహసీల్దార్ రాజేశ్వరి, ఎంపీడీవో మణిమంజరి, ఏడీఏ మహమ్మద్‌ఖాద్రీ, ఏవో హేమలత, సిబ్బంది పాల్గొన్నారు.

● ఈ నెల 16న ఎర్రకోట సెయింట్ జాన్స్ ఇంజనీరింగ్ కళాశాల బీటెక్ విద్యార్థులు ఉదయ్‌కుమార్, చెన్నరెడ్డి మృతి చెందిన విషయం విధితమే. గాజులదిన్నెలోని ఘటనా స్థలాన్ని కలెక్టర్ పరిశీలించి ఇరిగేషన్ ఎస్ఈ, ఏఈలను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

బాలోత్సవాలను జయప్రదం చేయండి

ఎమ్మిగనూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): బాలోత్సవాలను జయప్రదం చేయాలని కర్నూలు బాలోత్సవ కార్యదర్శి ధనుంజయ కోరారు. బుధవారం పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో బాలోత్సవ సన్నహాక సమావేశం నిర్వహించారు. ధనుంజయ మాట్లాడుతూ దేశంలో మతోన్మాద, మనువాదం భావాలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయన్నారు. చివరకు పాఠ్యాంశాల్లో కూడా మార్పులు చేసిన చరిత్రను వక్రీకరించి విద్యార్థుల్లో మనువాద భావజాలాన్ని చొప్పించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో ప్రజాస్వామ్య, లైకిక, రాజ్యాంగ పరిరక్షణ , అభ్యుదయ భావాలు, శాస్త్రీయ అవగాహన మొదలైన అంశాలపై విద్యార్థులకు చిన్నతనంలోనే అవగాహన పెంచడానికి బాల ఉత్సవాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. బాలోత్సవ కమిటీ నాయకులు రామాంజనేయులు, రంగస్వామి, ఎంసీవీ రమణారెడ్డి, రవికుమార్, నాగమణి, దావీదు, రాఘవేంద్ర, ప్రసాద్, రామాంజనేయులు, భాగ్యరాజు పాల్గొన్నారు.

పంటల పరిశీలన



సాతనూరులో నేలకొరిగిన పైరును పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు



ఎర్రకోటలో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న జేడీఏ వరలక్ష్మి

మంత్రాలయం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపురం, కాచాపురం, నారాయణపురం గ్రామాల్లో దెబ్బతిన్న వరి,పత్తి పంటలను జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు సుజాతమ్మ, సతీష్, ఆదోని ఏడీఏ బాలవర్ధిరాజు, మండల వ్యవసాయ అధికారులు గణేశ్, వరప్రసాద్ బుధవారం పరిశీలించారు. ఏవోలు గణేశ్ వరప్రసాద్ పరిశీలించారు. పంటల సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. ఏఈవో తిరుమల రెడ్డి, ఎంపీహెచ్‌ఈవో బసవరాజు ఉన్నారు.

కోసిగి: మొంథా తుపాన్ నేపథ్యంలో మండలంలోని తుంగభద్ర నది తీరమైన సాతనూరు, తుమ్మిగనూరు, కడిదొడ్డి, కందుకూరు, అగసనూరు గ్రామాల్లో చేతికొచ్చిన వరిపైర్లను మండల వ్యవసాయాధకారి ఎం.వరప్రసాద్ ఆధ్వర్యంలో కర్నూలు ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్తలు డా. సుజాత, డా.వైఎస్ సతీష్ కుమార్, ఆదోని సహాయ వ్యవసాయసంచాలకుడు బాలమర్ధిరాజు బుధవారం పరిశీలించారు. మొంథా తుపాన్ ప్రభావంతో తుంగభద్ర నది తీరంలోని వరి పైర్లు నేలబారీ నష్టం చేకూర్చింది.

ఎమ్మిగనూరు: రైతులు తాము పండించిన పత్తి పంటను ప్రైవేటు దళారీ వ్యాపారులకు విక్రయించి నష్టపోవద్దని జేడీఏ వరలక్ష్మి అన్నారు. బుధవారం ఎర్రకోట గ్రామ పరిధిలో రైతులు సాగుచేసిన మొక్కజొన్న పంటను పరిశీలించారు. జేడీఏ వెంట ఎమ్మిగనూరు ఏడీఏ మహ్మద్ ఖాద్రీ, ఏవో శివశంకర్, గోనేగండ్ల ఏఓ హేమలత ఉన్నారు.

భక్తుడికి అస్వస్థత

● తక్షణమే స్పందించి ఆసుపత్రికి తీసుకెళ్లిన శ్రీమఠం అధికారులు

మంత్రాలయం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన కర్ణాటకలోని మాండ్య పట్టణానికి చెందిన సంజాయ్ అనే భక్తుడు మఠం ప్రాంగణంలో అస్వస్థతకు గురయ్యారు. స్పృహ కోల్పోయి కిందపడిన భక్తుడి ప్రాణాలను శ్రీమఠం మేనేజరు ఎస్‌కే శ్రీనివాసరావు, సూపర్నిడెంట్ అనంతపురాణిక్,పోలీసు రంగస్వామి కాపాడారు. బుధవారం ఉదయం స్వామివారి దర్శనం కోసం వస్తుండగా సంజాయ్ ఒక్కసారి కుప్పకూలి కందకు పడ్డాడు. ఇది గమనించిన పోలీసు రంగస్వామి శ్రీమఠం అధికారులకు సమాచారం ఇచ్చారు. ఇందుకు వెంటనే స్పందించిన శ్రీమఠం అధికారులు హుటాహుటిన నీళ్ల తాగించి అక్కడున్న సిబ్బందితో చేతులతో ఎత్తుకుని బయటికి తెచ్చారు. వెంటనే శ్రీమఠం అంబులెన్స్‌ను పిలిపించి సుజయీంద్ర ఆరోగ్యశాలకు తరలించారు. డాక్టర్లు చికిత్స చేశారు. బీపీ కారణంగా స్పృహ కోల్పోయారని వైద్యులు తెలిపారు. మానవత్వంతో వెంటనే స్పందించిన మేనేజర్ ఎస్‌కే శ్రీనివాసరావు, అనంతపురాణిక్‌కు భక్తుడి బంధువులు కృతజ్ఞతలు తెలిపారు.

రాఘవేంద్రుడి సన్నిధిలో తెలంగాణ మానవ హక్కుల కమిషన్ సభ్యుడు



శ్రీమఠంలో కిషోర్ దంపతులు

మంత్రాలయం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం తెలంగాణ రాష్ట్ర మానవహక్కుల కమిషన్ సభ్యుడు డా. బి.కిషోర్ సతీ సమేతంగా బుధవారం దర్శించుకున్నారు. మంగళవారం రాత్రి మంత్రాలయంలో బస చేశారు. ఆలయ ముఖద్వారం వద్ద ఆయనకు మఠం మేనేజర్లు ఎస్ కే శ్రీనివాసరావు, వెంటేష్ జోషి, సురేష్ కోణాపూర్, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహామూర్తి ఘనంగా స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు రాఘవేంద్రస్వామి మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు. అనంతపురాణిక్, మంత్రాలయం ఎస్ఐ శివాంజల్, జయతీర్థఆచార్, వ్యాసరాజాచార్, రంగస్వామి, లక్ష్మీనారాయణ, రాఘవేంద్ర తదితరులు ఉన్నారు.

బెల్టు షాపులు నిర్వహిస్తే చర్యలు

ఎమ్మిగనూరు టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): బెల్టు షాపులు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ రమేష్ రెడ్డి హెచ్చరించారు. నందవరం మండలంలోని కనకవీడు గ్రామంలో అక్రమంగా బెల్టు షాపుల నిర్వహిస్తున్న బోయ హుస్సేనిని అరెస్టు చేసి 53 (180 ఎంఎల్) మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ దాడులలో ఎస్ఐలు ఇస్మాయిల్, రాయుడు, సుధాకర్, జీవమణి పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు



చెట్నహళ్లి గ్రామ సమీపంలో తనిఖీ చేస్తున్న ఎస్ఐ శివాంజల్

మంత్రాలయం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు తప్పవని మంత్రాలయం ఎస్ఐ శివాంజల్ హెచ్చరించారు. బుధవారం రాత్రి మంత్రాలయం మండలం చెట్నహళ్లి సమీపంలో ఆకస్మికంగా వాహనాలను తనిఖీ చేశారు. కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ, మహారాష్ట్ర నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు, కార్లు, ఆటోలు, మోటారు సైకిళ్ల ఆపి ప్రయాణికుల సంచులను తనిఖీ చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ రికార్డులు, అనుమతి లేని వాహనాలపై కేసులు నమోదుచేసి అపరాధ రుసుం విధించినట్లు తెలిపారు.

కోసిగి: మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని కోసిగిలో ట్రైనీ ఎస్ఐ ఈశ్వరరావు తెలిపారు. బుధవారం కోసిగిలోని వాల్మీకి సర్కిల్, రైల్వేగేటు సమీపంలో ట్రైనీ ఎస్ఐ ఈశ్వర్‌రావు ఆధ్వర్యంలో వాహనదారులకు బ్రీత్ అనలైజర్ ద్వారా డ్రంకెన్ డ్రైవ్ టెస్టు నిర్వహించారు. డ్రైవర్లకు సూచనలు చేశారు. మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల అధిక ప్రమాదాలు జరిగి వాహనా ప్రమాదాలు జరుగుతున్నాయని, అలాగే మైనర్లుకు వాహనాలు ఇచ్చిన వారిపైన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కానిస్టేబుల్ రాంప్రతాప్ ఉన్నారు.